# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 276, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం - 20- డిసెంబర్ - 2024


## కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్..
# ఐదుగురు ఉగ్రవాదుల హతం




కుల్గాంలోని ఓ ఇంటిలో ఉగ్రవాదులు దాక్కున్నట్టు సమాచారం

సంయుక్త ఆపరేషన్ నిర్వహించిన జమ్మూకశ్మీర్ పోలీసులు, భద్రతా బలగాలు

ఈ ఏడాది జరిగిన రెండో అతి పెద్ద ఎన్‌కౌంటర్ ఇదే

## రాహుల్ గాంధీపై ఎన్డీఏ.. బీజేపీపై కాంగ్రెస్ ఎంపీల ఫిర్యాదు



- పోలీసు స్టేషన్‌కు వెళ్లి రాహుల్ గాంధీ కి వ్యతిరేకంగా ఫిర్యాదు నమోదు
- ఘటనపై దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు వెల్లడి
- పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు అందజేశారు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఘటన పట్ల ఎన్డీఏ ఎంపీలు.. పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనురాగ్ ఠాకూర్, బాన్సురి స్వరాజ్‌తో పాటు మరో ఎంపీ.. మిగతా 2లో..

## బీజేపీ ఎంపీలు నన్ను నెట్టేశారు... నాకు గాయమైంది
# లోక్ సభ స్పీకర్ కు ఖర్గే లేఖ



అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలు

పార్లమెంటు ప్రాంగణంలో తోపులాట

తన మోకాళ్లకు గాయమైందన్న ఖర్గే

విచారణ జరిపించాలని లోక్ సభ స్పీకర్ కు లేఖ

న్యూఢిల్లీ,: అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు విపక్షాలను ఆగ్రహావేశాలకు గురిచేశాయి. ఈ నేపథ్యంలో,పార్లమెంటుప్రాంగణం మిగతా 2లో..

## ఈ నెల 28న చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం




రూ.430 కోట్లలో చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణం

ప్రారంభించనున్న కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డి

అత్యాధునిక సౌకర్యాలతో నిర్మితమైన రైల్వే టెర్మినల్

హైదరాబాద్, : పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సికింద్రాబాద్ కు సమీపంలోని చర్లపల్లి వద్ద నిర్మించిన భారీ రైల్వే టెర్మినల్ మిగతా 2లో..

# మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుంది

- కొత్త సంస్కృతిని సభలో తీసుకురావద్దని స్పీకర్‌ను కోరారు
- రాష్ట్రాన్ని అతిఎక్కువ పాలించింది కాంగ్రెస్ పార్టీ.
- కాళేశ్వరం జలాలను నల్లగొండ జిల్లా, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించేదే బీఆర్ఎస్ పార్టీ
- నేడు మూసీ వల్ల నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారు



వివరాలు 2లో..


హైదరాబాద్: కేబినెట్ నిర్ణయం అంటే సమిష్టి నిర్ణయమని, కృష్ణన్ అవర్‌లో ఒక మంత్రి మరొక మంత్రిని ప్రశ్న అడగడం ఏంటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందన్నారు. ఐదోరోజు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని నీటి సమస్యలను

## కేటీఆర్ పై ఏసీబీ కేసు...
# ఈ-కార్ రేసింగ్ కేసులో ఏ1గా కేటీఆర్



వివరాలు 2లో..


అనుమతులు లేకుండా రూ. 55 కోట్లు చెల్లించినట్టు ఆరోపణ

కేసులో ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్

కేటీఆర్ కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిచే అవకాశం

హైదరాబాద్, : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ లో కేటీఆర్ పై కేసు నమోదయింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని చేర్చారు. విదేశీ కంపెనీకి ఎలాంటి అనుమతులు లేకుండానే రూ. 55కోట్లు చెల్లించారనే ఆరోపణలతో కేసు నమోదయింది. కేటీఆర్ పై కేసు నమోదు చేయడానికి అనుమతించాలని

## మీరేమంటారు.. చంద్రబాబు, నితీశ్‌కు కేజ్రీవాల్ లేఖ



ఢిల్లీ,: ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బీహార్ సీఎం నితీశ్ కుమార్‌లకు లేఖ రాశారు. అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందనేంటో తెలియజేయాలని లేఖలో కోరారాయన. "బాబా సాహెబ్‌ను అమిత్ షా అవమానించారు. ఈ అవమానానికి మీ మద్దతు ఉందా?.. మీ నుంచి సమాధానం కోసం యావత్ దేశం ఎదురు చూస్తోంది" అని ఎక్స్ ఖాతాలో ప్రశ్నించారాయన. టీడీపీ, జేడీయూలు ఎన్డీయే కూటమిలో ప్రధాన భాగస్వామ్య పార్టీలుగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగే.. అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు సమర్థనీయం కాదు. కోట్లాది మంది మనోభావాలు దెబ్బ తిన్నాయి. అమిత్ షా కనీసం క్షమాపణలు కూడా చెప్పలేదు. ప్రధాని మోదీ కూడా అమిత్ షానే సమర్థిస్తున్నారు. మిగతా 2లో..

# కూటమి కొత్త ఎమ్మెల్సీలు

## - పవన్ సిఫార్సు, చంద్రబాబు ఛాయిస్..!!



అమరావతి,: ఏపీలో పదవుల కోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ సీట్ల భర్తీ పూర్తి కావటంతో ఇప్పుడు ఎమ్మెల్సీ సీట్ల కోసం పోటీ పెరిగింది. నామినేటెడ్ లిస్టులో ఎవరికి అవకాశం ఉంటుందనేది ఇప్పటికే దాదాపు స్పష్టత వచ్చింది. దీంతో, ఎమ్మెల్యేగా పోటీకి అవకాశం దక్కని నేతలు ఎమ్మెల్సీ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, ప్రస్తుతం ఉన్న ఖాళీలు .. రాబోయే రోజుల్లో మొత్తంగా 13 వరకు ఎమ్మెల్సీ స్థానాలు భర్తీ చేయాల్సి ఉంటుంది. దీంతో, ఈ లిస్టు పైన ఇప్పటికే చంద్రబాబు - పవన్ ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

పెరుగుతున్న ఖాళీలు

కూటమిలోని మూడు పార్టీల్లోని సీనియర్లు ఎమ్మెల్సీ సీట్ల పైన ఆశలు పెట్టుకున్నారు. మండలి లో ఇప్పటికే వైసీపీ నుంచి కర్రి పద్మశ్రీ, పోతుల సునీత, బల్లి కళ్యాణచక్రవర్తి, మిగతా 2లో..

# కలలో కూడా ఆ పని చేయమన్న అమిత్ షా

'కాంగ్రెస్ రాజ్యాంగ వ్యతిరేక పార్టీ

అమిత్ షా ఏం చెప్పారో టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా దేశం మొత్తం చూసింది

అంబేద్కర్‌పై ప్రధాని మోడీకి గౌరవముంటే తక్షణం అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్

అలాంటి వాటిని అంబేద్కర్ ఎప్పుడూ సమర్థించలేదన్న ఖర్గే




న్యూఢిల్లీ,: తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తోందంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీపై తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్?పై తాను అనుచిత వ్యాఖ్యలు చేశానంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌కు, రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఎదురుదాడి చేశారు. ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు రాజ్యాంగ విలువలను ఉల్లంఘించారన్నారు అమిత్ షా. పార్లమెంట్?లో అంబేద్కర్?గురించి తాను చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించదన్నారు. అంబేద్కర్‌ను ఎప్పటికీ, కనీసం కలలోనూ అవమానించలేని పార్టీ నుంచి వచ్చినట్లు అమిత్ షా చెప్పారు. 'కాంగ్రెస్ రాజ్యాంగ వ్యతిరేక పార్టీ. ఆయనకు భారతరత్న ఇవ్వలేదు. కేంద్రంలో బీజేపీ మద్దతు ఉన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరణానంతరం ఆయన(అంబేద్కర్)కు భారతరత్న ఇచ్చింది. కాంగ్రెస్ ఏనాడూ అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించలేదు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను ఎంతో గౌరవించిందని అమిత్ షా తెలిపారు. మిగతా 2లో..


## పోరాటాలకు సమయం ఆసన్నమయింది....
# నాయకులుగా ఎదగడానికి మీకు ఇదొక అవకాశం

- పూర్తిగా చంద్రముఖిలా మారిన చంద్రబాబు..
- ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలతో జగన్ సమావేశం
- చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్న జగన్
- చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించారని వ్యాఖ్య
- చంద్రముఖిని లేపడమంటే పులి నోట్లో తల పెట్టడమేనని ఆరోజు చెప్పానన్న జగన్
- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని మండిపాటు



తాడేపల్లి: ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. రాష్ట్రంలో కుంభకోణాల మీద కుంభకోణాలు జరుగుతున్నాయి. చంద్రబాబు పూర్తిగా చంద్రముఖిగా మారి పోయారు..ఇసుకమాఫియా, లిక్కర్ మాఫియా.. ఇలా మాఫియాలు చేస్తున్నారన్నారని వైఎస్ జగన్ అన్నారు. ఇలాంటి సమయంలోనే మనం గొంతు విప్పాలని పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. నాయకులుగా ఎదగడానికి ఇదొక అవకాశమని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలతో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ మాట్లాడుతూ.. 'ఆరు నెలలు తిరక్కముందే చంద్రబాబు ప్రభుత్వంమీద మిగతా 2లో..


## మేం జగనన్న సైనికులం..
# ఎవరికీ భయపడం




- భయమనేది జగన్ బ్లడ్ లోనే లేదన్న మాజీ మంత్రి
- ఈవీఎంలను మానిపులేట్ చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపణ
- ప్రభుత్వం నీతిమాలిన రాజకీయాలు చేస్తోందని మండిపాటు

అమరావతి,: ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో ప్రజలకు చేసిన మంచి ఏమీలేదని మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా విమర్శించారు.

## జగన్ కోరిక తీరుస్తున్న కాంగ్రెస్...
# షర్మిలకు షాకేనా...



అమరావతి,: జగన్ ని కోర్టు దాకా నడిపించాలని కూడా ఆమెకు కోరిక ఉన్నట్లుగా తాజాగా అదానీ ముడుపుల విషయంలో ఆమె చేసిన ప్రకటనలు తెలియచేస్తున్నాయని అంటున్నారు. వైసీపీ అధినేత జగన్ కి ఏపీలో ప్రత్యర్థి ఎవరు అంటే అందరూ సహజంగా చెప్పే మాట టీడీపీ అని. కానీ నిజానికి టీడీపీ కంటే కూడా ఎక్కువగా జగన్ ని సాధిస్తున్నది మాత్రం సొంత చెల్లెమ్మ షర్మిల అన్నది కూడా కాస్త నిశితంగా విశ్లేషించిన వారికి అర్థం అయ్యే విషయం. జగన్ ని కోర్టు దాకా నడిపించాలని కూడా ఆమెకు కోరిక ఉన్నట్లుగా తాజాగా అదానీ ముడుపుల విషయంలో ఆమె చేసిన ప్రకటనలు తెలియచేస్తున్నాయని అంటున్నారు. షర్మిలను ఏ ముహూర్తాన ఏపీసీసీ చీఫ్ గా చేశారో కానీ ఆమె జగన్ మీదనే తన మొత్తం బాణాలను ఎక్కుపెడుతున్నారు. అంతే కాదు ఆమె జగన్ వదిలిన బాణాన్ని అని ఒకనాడు మిగతా 2లో..

# మాల మహానాడు నాయకుల అరెస్టు




వలిగొండ, మండల రిపోర్టర్ వెంకట్ రెడ్డి (శుభోదయం న్యూస్): మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ఆదేశించారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి వలిగొండ మండల మాల మహానాడు నాయకులను గురువారం తెల్లవారుజామున ఇండ్లలోకి వచ్చి అక్రమ అరెస్టు చేసి వలిగొండ స్టేషన్ కి తరలించిన పోలీసులు. ఈ సందర్భంగా మాల మహానాడు వలిగొండ మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ మాట్లాడుతూ ఇలాంటి అక్రమ అరెస్టుల వలన ఉద్యమాన్ని ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్, సీనియర్ నాయకులు రాపోలు పవన్ కుమార్ లు ఉన్నారు.

# అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా మాల మహానాడు రాస్తారోకో



వలిగొండ, మండల రిపోర్టర్ వెంకట్ రెడ్డి (శుభోదయం న్యూస్): పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి,ఆర్ అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడిన తీరును,తీవ్రంగా ఖండిస్తూ వలిగొండ మండల కేంద్రంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర మాల మహానాడు నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ అవమానపరిచిన అమిత్ షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల మాజీ మండల అధ్యక్షులు నీలం నరేందర్ సంగిశెట్టి ప్రభాకర్ కాశమల్ల శేఖర్ కట్ట సురేష్,పి అంజయ్య,చలి చీమల కృష్ణ. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# 60 ఎకరాలకు హక్కుదారులు... కూలీల కంటే హీనంగా బ్రతుకుతున్నారు...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (స్టాప్ రిపోర్టర్) కొమ్ము శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) డిసెంబర్.19 : కుటుంబానికి పెద్దవాడు. తండ్రి తర్వాత తండ్రి లా అన్నదమ్ములను వారి పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవలసిన వాడు. స్వార్థపరుడు అయితే. సొంత తమ్ముళ్ల భార్య పిల్లలు రోడ్డున పడ్డ సంఘటన. వివరాలు.. తెలంగాణ సరిహద్దు రాష్ట్రం శివారు గ్రామమైన ఏలూరు జిల్లా కుకునూరు మండలం సీతారామ



నగరం గ్రామానికి చెందిన. ఏలూరు రామయ్యకు ఐదుగురు కుమారులు ఇద్దరు కూతుళ్లు. వీరందరికీ తండ్రి నుంచి వారసత్వంగా సంక్రమించిన ఆస్తి అక్షరాల 60 ఎకరాలు. ఐదుగురు కుమారులలో మోహన్ రావు. కు భార్య ఇద్దరు ఆడపిల్లలు. ముక్తేశ్వరరావు కు ఇద్దరు మగ పిల్లలు . మోహన్ రావు. ముక్తేశ్వరరావు లు చనిపోవడంతో వారి కి ఆస్తిలో సెంటు భూమి ఇవ్వకుండా. సిల్లిగవ్వ లేకుండా చేయాలన్న ఉద్దేశంతో. పెద్ద అన్నయ్య అయిన ఏలూరు వెంకటేశ్వరరావు. చనిపోయిన ఇద్దరు తమ్ముళ్ల భార్య పిల్లలను రోడ్డున పడేసినాడు. 60 ఎకరాలకు హక్కుదారులుగా ఉన్నప్పటికీ డైలీ కూలీల కంటే హీనంగా వారి బతుకులు వెల్లదీస్తున్నారు. ఊర్లో పెద్దమనుషులు చుట్టు తిరిగి తిరిగి వారు అలసిపోయారు తప్ప న్యాయం చేయలేకపోయారు. ఇక పోలీస్ స్టేషన్. మండల రెవెన్యూ ఆఫీస్ చుట్టూ తిరగని రోజంటూ లేదు.రాజకీయ ఆర్థిక పలుకుబడులతో రక్తసంబంధీకులైన తమ్ముళ్ల భార్య పిల్లలపై రాక్షసుడిలా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే వ్యక్తి చుట్టుపక్క గ్రామాలకు చెందిన హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాలకు చెందిన. వ్యక్తుల అవసరాలను ఆసరాగా తీసుకొని వారి భూములను అతి తక్కువ ధరకు కౌలుకు తీసుకొని వందలాది ఎకరాల్లో జమాయిల్ వేసినాడు. అతనికున్న రాజకీయ పలికి బడితో అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ వస్తున్నాడు. అతను చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించిన వారికి డబ్బుతో నోరు మూయించే అలవాటు బాగా ఉంది. సొంత తమ్ముళ్లు చనిపోతే వారి భార్య పిల్లలకు చెందాల్సిన భూమిని సైతం వారికి ఇవ్వకుండా.. మీ దిక్కున చోట చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత బావగారి ఇంత నీచ్యానికి ఒడిగట్టి.. మా నోట్లు మట్టి కొట్టాడని ఈ విషయంలో మాకు న్యాయం చేసే నాధుడే లేడని. 60 ఎకరాలకు హక్కుదారులుగా ఉన్న మేము నేడు కూలీల కంటే దుర్భరంగా బతుకుతున్నామని.. మా రెండు కుటుంబాలకు తగు న్యాయం జరగకపోతే మూకుమ్మడిగా పిల్లలతో సహా ఆత్మహత్య శరణ్యమని వారు తెలిపారు. ఎప్పుడు పురాణ కాలంలో నీచుడు. కీచకుడు. ఉంటాడని పురాణాల్లో విన్నావు గాని.. సొంత ఇంటిలోన ఇలాంటి నీచుడు ఉంటాడని మేము కలలో కూడా ఊహించలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాహం.. ధన దాహం తో.. తోబుట్టు వు. భార్య పిల్లలను రోడ్డున పడేసి.. మా రెండు కుటుంబాలను అంతమొందించే ప్రయత్నం చేస్తున్నాడని మా ప్రాణాలకు ఏ హాని జరిగినా. ఏలూరు వెంకటేశ్వరరావు అతని కొడుకుదే బాధ్యతని.

# అంత్యక్రియలకు వి.వి.ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం



బొల్లారం (శుభోదయం న్యూస్) : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న బస్తీలో నివసించే బీహార్'కు చెందిన అరవిందరామ్(26 సం") అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పేద కుటుంబానికి అండగా నిలుస్తూ వి.వి.ఆర్ ఫౌండేషన్ తరపున అంత్యక్రియల నిమిత్తం అయిదు వేల రూపాయలు(5,000/ ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కష్టకాలంలో వి.వి.ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంపత్ రెడ్డి,మాజీ ఎం.పీ.టీ.సీ కృష్ణంరాజు, రవీందర్ రెడ్డి, దీననాథ్, జైరాం, కృష్ణ సింగ్, మహేష్ రామ్, బాధిత కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

శుభోదయం

# అమిత్ షా భారత ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

## చిప్పకుర్తి శ్రీనివాస్ టివియువి రాష్ట్ర కార్యదర్శి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి – శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి పై కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంచిర్యాల లో స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణలో టివియువి గా పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేద్కర్ గారు ప్రపంచంలోనే గొప్పదైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందివ్వడం జరిగిందని ఆ రాజ్యాంగం ఫలితంగానే అమిత్ షా ఈ రోజు కేంద్రమంత్రిగా కొనసాగుతున్నారని అన్నారు. దానిని మర్చిపోయి అంబేద్కర్ పై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆ వ్యాఖ్యలు కేవలం అంబేద్కర్ పై జరిగిన దాడి కాదని యావత్ భారత దేశ ప్రజలపై,భారత రాజ్యాంగాన్ని గౌరవించే వారిపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. అమిత్ షా తాను చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని భారతదేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాలాజీ, గణేష్, రాజు, సంతోష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు..

# సమగ్ర శిక్ష ఉద్యోగులమైన మమ్మల్ని రెగ్యూలరైజ్ చేయాలి

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా




మంచిర్యాల జిల్లా ప్రతినిధి – శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) : మంచిర్యాల జిల్లా లోని విద్యాశాఖ లో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు వేంటనే రెగ్యూలరైజ్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు గత పది రోజుల నుండి కలెక్టరేట్ దగ్గర నిరవధిక సమ్మె చేస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ మేము చాలి చాలని వేతనాలతో వెట్టి చాకిరి గత 15 సంవత్సరములుగా చేస్తున్నాం. ప్రత్యేక రాష్ట్రం వస్తే మా జీవితాలు మారుతాయి అనుకున్నాం కాని మారలేదు. గత పోయిన సంవత్సరము మా సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నా చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మా ప్రభుత్వం వస్తే మిమ్మల్ని రెగ్యూలరైజ్ చేస్తామని చెప్పడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారము సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని వేంటనే నిలబెట్టుకోవాలని కోరారు. మమ్మల్ని రెగ్యూలరైజ్ చేయాలని, అప్పటి వరకు పే స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము... సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు గా వివిధ రాజకీయ నాయకులు, ఉపాధ్యాయ సంఘుల నాయకులు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్షురాలు సుమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న మరియు వివిధ సమగ్ర శిక్ష ఉద్యోగుల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు..

# ఘనంగా క్రిస్ట్ ఉన్నత పాఠశాల 8 వ వార్షికోత్సవ వేడుకలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి – శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) : మంచిర్యాల జిల్లా లో ఘనంగా క్రిస్ట్ ఉన్నత పాఠశాల గద్దెరాగడి 8 వ వార్షికోత్సవ వేడుకలను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బినొయ్ మాథ్యూస్ ఆద్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అంటే పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది దీనికంటే ఎక్కువగా తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యం సమాజంలో పిల్లలు ఏవిధముగా ఉండాలన్న ముందు ఇంటి నుండే క్రమశిక్షణ అవసరం. పాఠశాల చదువు తో పాటు సమాజంలో ఏ విధముగా జీవించాలో నేర్పించాల్సిన అవసరం నేటి రోజుల్లో ఏర్పడుతుంది తల్లిదండ్రులు పిల్లల పై ప్రత్యేక దృష్టి పెట్టి వారి ఉన్నతికి కృషి చేయాలని సుచించారు. పిల్లలు ఉపాధ్యాయుల తల్లిదండ్రుల మరియు పెద్దల పట్ల గౌరవం కలిగి తోటి విద్యార్థులు తో సోదరభావం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిసోస్ రెవరెండ్ జోసఫ్ ఫిలిఫ్, రామకృష్ణాపూర్ ఎస్ ఐ రాజశేఖర్, క్యాతన్ పల్లి కౌన్సిలర్స్ పోలెం సత్యం, పారుపల్లి తిరుపతి, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కు సిఐటియు మద్దతు

## సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు




రామగుండం మండలం రిపోర్టర్–తిరుపతి,(శుభోదయం న్యూస్) గత పది రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్న విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు వారి సమస్యలు పరిష్కరించాలని గత పది రోజులుగా సమ్మె చేస్తున్న సందర్భంలో వారి డిమాండ్స్ పరిష్కరించాలని ఈరోజు వారి సమ్మె శిబిరాన్ని సిఐటియు ప్రతినిధి బృందం సందర్శించి సంఘీభావం తెలిపింది. ఈ




సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులను వారి ఈ పేస్కేల్ అమలు చేయాలని జీవిత బీమా, ఆరోగ్య బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . యూనియన్ ప్రతినిధి బృందాన్ని చర్చలకు పిలిచి సమ్మెను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఉద్యోగ కార్మికుల సమస్యలను విస్మరించిందని ఎన్నో ఆశలతో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించారని అన్నారు. ప్రభుత్వ స్పందించేదాకా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులుజి,జ్యోతి,సిపెల్లి రవీందర్, ఎండి కాజా తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా ఎదురయ్యే ఉపద్రవాల నుండి రక్షణ కోసం స్థానికులకు అవగాహన కార్యక్రమం


## జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్ డి ఆర్ ఎఫ్) ఆధ్వర్యంలో




గోదావరిఖని టౌన్ రిపోర్టర్–సురేష్,(శుభోదయం న్యూస్)ఆకస్మికంగా ఎదురయ్యే ఉపద్రవాల నుండి బయటపడడంపై జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ( ఎన్ డి ఆర్ ఎఫ్ ) ఆద్వర్యంలో సప్తగిరి కాలనీ లో గురువారం స్థానికులకు అవగాహన కల్పించారు . ప్రమాదవశాత్తు నీళ్ళల్లో జారి పడడం , పిడుగులు పడడం , వరదలు రావడం వంటి విపత్తులు ఎదురయినప్పుడు బాధితులు , చుట్టు ప్రక్కల వారు ప్రతిస్పందించాల్సిన తీరుపై జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ప్రతినిధులు అవగాహన కల్పించారు. అలాగే గ్యాస్ సిలిండర్ మంటలు, కరెంట్ షాక్ వంటి ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుండె పోటు వచ్చినప్పుడు సి పి ఆర్ చేయడం గురించి కూడా ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు . ఎన్ డి ఆర్ ఎఫ్ పదవ బెటాలియన్ ( విజయవాడ ) కమాండర్ ఐ ఎన్ ఎస్ పి బబ్లు బిశ్వాస్ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో రామగుండం మండల తహశీల్దార్ కుమార స్వామి , నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ ప్రసాద్ , ఫైర్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ మండల విద్యాధికారి చంద్రయ్య , , ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , సానిటరీ ఇన్స్పెక్టర్ లు , సానిటరీ సూపర్ వైజర్లు , నగర పాలక సంస్థ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు. కాగా ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం గతంలో వరద ముంపు కు గురయిన లోతట్టు ప్రాంతాలతో పాటుగా గోదావరి నదీ తీరాన్ని సందర్శించింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నివారణ అలాగే సహాయక చర్యలు చేపట్టడంపై ఎన్ డి ఆర్ ఎఫ్ ప్రతినిధులు అధికారులకు అవగాహన కల్పించారు.

# అయ్యప్పస్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

## రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



రామగుండం మండలం రిపోర్టర్–తిరుపతి,(శుభోదయం న్యూస్) అయ్యప్పస్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ గారు స్వామి వారిని వేడుకున్నారు. గోదావరిఖని పోచమ్మ దేవాలయం ఆవరణలో శ్రీ ధర్మశాస్త్ర నిత్యాన్నాధాన వేదిక వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్పస్వామి వారి పడి పూజ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే గారు పాల్గొని మాట్లాడారు. కౌటం బాబు గత 36 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి దీక్షను తీసుకుని శ్రీ ధర్మశాస్త్ర నిత్యాన్నాధాన వేదిక ఏర్పాటు చేసి ఎన్నో ఎళ్లుగా అనార్ధులకు అన్నదానం చేయండం గొప్ప విషయం అన్నారు. 41 రోజుల పాటు పోచమ్మ దేవాలయం ఆవరణ అన్నవితరణ కార్యక్రమం చేపట్టడం సంతోషకరం అన్నారు. తాము ఎన్నో ఎళ్లుగా అయ్యప్పస్వామి దీక్షను తీసుకోవడం జరుగిందని మూడు సంవత్సరాలు అయ్యప్పస్వామి వారి 108 రోజుల దీక్షను తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం లో ధర్మశాస్త్ర వేదిక వ్యవస్థపాకులు కౌటం బాబు రఘుసింగ్ కార్పోరేటర్లు పాముకుంట్ల భాస్కర్ కల్వచర్ల కృష్ణ వేణీ గాధం విజయ నాయకులు నారాయణదాసు మారుతి పర్లపల్లి రవి కుడుదుల శ్రీనివాస్ మహేందర్ వెంకన్న ముద్దసాని సంధ్యా రెడ్డి అవునూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాలను మొక్కుతూ సిద్ధాంతాలను తొక్కాలని చూస్తున్న కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్

## దళిత, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



రామగుండం మండలం రిపోర్టర్–తిరుపతి,(శుభోదయం న్యూస్) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానించే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను బర్త్ రఫ్ చేయాలని గురువారం గోదావరిఖనిలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్ మాట్లాడుతూ భారతీయ ప్రజల ఆరాధ్య దైవం, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి డాక్టర్ భీంరావ్ అంబేద్కర్ భారత దేశానికి రాజ్యాంగాన్ని అందించారని, ఆ రాజ్యాంగ ప్రకారమే దేశ పరిపాలన కొనసాగుతుందని, ఈ రోజు అంబేద్కర్‌ను అవమానించడమంటే బారత రాజ్యాంగాన్ని, భారత ప్రజలనుఅవమానించినట్లేనని, భారత రాజ్యాంగం ప్రకారం కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను ఎందుకు మొక్కుతున్నారంటూ మాట్లాడటం సరైంది కాదని, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, మతోన్మాదులుగా భారత ప్రజలను మార్చాలని చూస్తున్న కేంద్ర మంత్రి అమిత్ షాను బర్త్ రఫ్ చేయాలని, దేశ ప్రధాని మోడీ వెంటనే అమిత్ షాను సస్పెండ్ చేయాలని, అమిత్ షాను సస్పెండ్ చేయని పక్షంలో దళిత, కుల, విద్యార్థి సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలను కలుపుకొని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. బిజెపి నాయకులు అంబేద్కర్ విగ్రహాలను మొక్కుతూ అంబేద్కర్ సిద్ధాంతాలను తొక్కాలని చూస్తున్నారని, భారత రాజ్యాంగం పట్ల గౌరవం లేకుండా రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు పన్నుతున్నారని, భారత రాజ్యాంగం విషయంలో గానీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విషయంలో గానీ ఎలాంటి వ్యాఖ్యలు చేసిన సహించబోయేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్, శ్రీకాంత్, శివాజీ, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

# అమిత్ షా వ్యాఖ్యలతో దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి..

## అమిత్ షా పై చర్యలు తీసుకునేంత వరకు కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుంది.



గోదావరిఖని టౌన్ రిపోర్టర్– సురేష్,(శుభోదయం న్యూస్) లోకసభ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా డా. బి.ఆర్ అంబేద్కర్ గారి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, అమిత్ షా ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ గారితో, రాష్ట్ర మంత్రులతో మరియు సహచర ఎమ్మెల్యేలతో, ఎమ్మెల్సీలతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న లిగౌరవ రామగుండం శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజ్ ఠాగూర్.

### భారత రాజ్యాంగ నిర్మాత

## డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా

### రాజ్యాంగం, అంబేద్కర్ సేవలను తుడిచి పెట్టే విధంగా కుట్రలు

### వామపక్ష పార్టీలు, దళిత సంఘాల నాయకులు



గోదావరిఖని టౌన్ రిపోర్టర్– సురేష్,( (శుభోదయం న్యూస్) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అవమానించారని వామపక్ష పార్టీల, దళిత సంఘాల నాయకులు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్, సిపిఐ నాయకులు కె.కనకరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ఐ.కృష్ణ, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు జూపాక శ్రీనివాస్, టిబిజికెఎస్ నాయకులు మాదాసి రామ్మూర్తి, ఎఐటియుసి నాయకులు కవ్వంపల్లి స్వామిలు అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని మున్సిపల్ టి జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వాక్యాలను ప్రతి ఒక్కరూ ఖండిరచాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని అమిత్ షా అవమానించారని, తన వ్యాఖ్యలు డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను దేశం సహించబోదని అన్నారు. రాజ్యాంగాన్ని, అంబేద్కర్ సేవలను బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద ప్రభుత్వం తుడిచి పెట్టే విధంగా కుట్రలు చేస్తుందన్నారు. కోట్లాది మంది దళితులు అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతీక అని అన్నారు. ఈ దేశంలో బడుగు బలహీన వర్గాల కోసం దళితుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప మేధావి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని, అలాంటి గొప్ప వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయటం దురదృష్టకరమని అన్నారు. తక్షణమే కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, దళిత సంఘాలు, అంబేద్కర్ సంఘాల నాయకులు గౌతమ్ గోవర్ధన్, వేల్పుల కుమారస్వామిసారయ్య,ఈ.నరేష్, పులి మోహన్, తోకల రమేష్, ఆరెల్లి పోచం, మహేశ్వరి, గుమ్మడి వెంకన్న, చంద్రశేఖర్, కన్నం లక్ష్మీనారాయణ. రమేష్ కుమార్, రేణుక, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష

### రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్



రామగుండం మండలం రిపోర్టర్–తిరుపతి,(శుభోదయం న్యూస్) నాణ్యతతో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను రామగుండం నగర మేయర్ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి యు ఎఫ్ ఐ డి సి , పదిహేనవ ఆర్థిక సంఘం , స్పెషల్ డెవెలప్మెంట్ ఫండ్ నిధులతో టెండర్ పిలిచిన అన్ని పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి విచ్చేసిన క్రమంలో మంజూరు చేసిన రూ 20 కోట్ల రూపాయల నిధులకు సంబంధించిన పనులకు అంచనాలు సిద్ధం చేసి, టెండర్లు పిలిచి పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని అన్నారు. ముఖ్య కూడళ్ల అభివృద్ధి పనులు ,కొత్త సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని అన్నారు. లక్ష్మీ నగర్ , కళ్యాణ్ నగర్ లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్ ఇ శివానంద్ , ఇ ఇ రామన్ , అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు , డి ఇ లు , ఎ ఇ లు , వర్క్ ఇన్స్పెక్టర్ లు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) డిసెంబర్–19: గురువారం పెద్దపల్లి పట్టణం అమర్ నగర్ చౌరస్తా వద్ద 35వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే ను జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే పై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని. ప్రజలు సైతం అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోని సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్ లతో సహకరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్ లు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని. సకాలంలో సర్వే పూర్తి చేసేందుకు అవసరమైతే అదనపు లాగిన్లు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ప్రతి దరఖాస్తు ద్వారానే ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితి గతి తెలిసేలా ఫోటో యాప్ లో అప్లోడ్ చేయాలని. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు రావడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు.ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్. సంబంధిత అధికారులు. తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆస్తులకు భంగం కల్పిస్తున్న రౌతు కవిశ్వర్ పై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్



కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి మేడం కి. ఓదెల మండలం జీలకుంట గ్రామం ప్రాథమిక పాఠశాలలో ఎస్జిటిగా విధులు నిర్వహిస్తున్న. రౌతు కవిశ్వర్ అనే ఉపాధ్యాయుడు సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకొని క్రైమ్ నెంబర్ 147.2024, సెక్షన్.329.4. 324.4. ఆర్. డబ్ల్యూ 3.5. బి ఎన్ ఎస్ చట్టం ప్రకారం పొత్కపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. కావున ఈ ఉపాధ్యాయుడిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని జిల్లా డీఈవో కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి.జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రజల మధ్య వైశాల్యాలు రెచ్చగొడుతూ ప్రజల ఆస్తులకు భంగం కల్పిస్తున్నాడు కావున అతనిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని కోరారు. ఓదెల మండలం ప్రాథమిక పాఠశాలలో రౌతు కవిశ్వర్ ఎస్జిటి టీచర్ గా తన సొంత గ్రామం అయినటువంటి జీలకుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఆకునూరి కొమరయ్య తండ్రి మొదలయ్య యొక్క ఇంటి స్థలంలోకి.అక్రమంగా అనుమతి లేని వినాయక మండపాన్ని.ఏర్పాటు చేసి ప్రజలను సమీకరించి అనధికారికంగా ఆకునూరి కొమరయ్య ఇంటి స్థలంలోని ప్రహరీ గోడను కూల్చివేసి 25 వేల రూపాయల నష్టం చేశారు. ఫిర్యాదు దారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొత్కపల్లి పోలీస్ స్టేషన్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడైన రౌతు కవిశ్వర్ పై కేసు నమోదు చేశారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రౌతు కవీశ్వర్ టీచర్ ఉద్యోగంలో ఉంటూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల మధ్య వైశాల్యాలు రెచ్చగొడుతున్నాడు.కావున అతనిపై తక్షణమే విచారణ చేపట్టి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్నకొండ ఆదిత్య. రాజు. వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షా మనువాద ఆలోచనలు మానుకోవాలి. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి కేవీపీస్.

### జిల్లా కార్యదర్శి.కల్లేపల్లి అశోక్



కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్):ఈ దేశ సకల జనులకు సర్వహక్కులను ప్రసాదించి బాధ్యతలను అప్పజెప్పి మార్గదర్శిగా నిలిచిన అంబేద్కర్ భారతీయ సమాజానికి ఆరాధ్యుడని కేవీపీస్ జిల్లా కార్యదర్శి. కల్లేపల్లి అశోక్ అన్నారు.పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను కించపరిచే విధంగా. కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడిన తీరును నిరసిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీస్ ఆధ్వర్యంలో బస్టాండ్ అంబెడ్కర్ విగ్రహం దగ్గర అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్ షా ఒంటినిండా మనువాద భావజాలాన్ని నింపుకొని.అంబేద్కర్ ని అవమానకరంగా మాట్లాడడం ఈ దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని అన్నారు .ముఖ్యంగా ఈ దేశంలో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు హక్కుల పరంగా బాధ్యతల పరంగా రక్షణలను కల్పిస్తూ వారి ఎదుగుదల కోసం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం సర్వోన్నతమైనదని అది జీర్ణించుకోలేని మనువాద పాలకులు. కులాధిపత్య,మతాధిపత్య భావజాలాన్ని విస్తరింప చేయడానికి సమ సమానత్వాన్ని ఆకాంక్షించిన అంబేద్కర్ ని విస్మరిస్తున్నారని ఇది భారత రాజ్యాంగ ఆకాంక్షలకు వ్యతిరేకమని అన్నారు . అసమానతలను. అస్పృశ్యతులను. సృష్టించడమే పనిగా ఈ మతోన్మాద పాలకులు పెట్టుకున్నారని అన్నారు. ప్రపంచ దేశాలు మరియు ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు అంబేద్కర్ ని సర్వోన్నతమైనటువంటి మేధావిగా కీర్తిస్తుంటే.మన దేశ పాలకులు మాత్రం తులనాడుతున్నారని అవేధన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్రమంత్రి అమిత్ షా ఈ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా రాజీనామా చేయాలి. ఈ దేశ ప్రజలు జీవించడానికి కావలసినటువంటి జీవించే హక్కు. స్వేచ్ఛ. సమానత్వం. సౌభ్రాతృత్వం. సామాజిక న్యాయం ఇలా అనేక రకాలైన ప్రజాస్వామిక విలువలను అందించిన మహనీయుడు అంబేద్కర్ ని స్మరించడం ఏ నేరం కిందికి వస్తుందో అమిత్ షా రుజువు చేయాలన్నారు. అంబేద్కర్ శాస్త్రీయమైన ఆలోచన లను అమలు చేయకుండా అశాస్త్రీయమైన మనువాద భావజాలాన్ని పదేపదే పార్లమెంట్ లో ప్రస్తావించడం అమిత్ షా అనాగరికమైన ఆలోచనలకు నిదర్శనం అన్నారు.అంబేద్కర్ ప్రచురణలను పదేళ్లు గా ముద్రించకుండా. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యమే అంబేద్కర్ పట్ల వాళ్లకు ఉన్న అక్కసుకు నిదర్శనం అన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని అంబేద్కర్ ఆలోచనలను విస్తరింప చేయాలనే చిత్తశుద్ధి ఈ పాలకులకు ఉంటే ఏ మేరకు అంబేద్కర్ పేరు పైన పథకాలను తీసుకొచ్చారో. ఎన్నిసార్లు అంబేద్కర్ గురించి పార్లమెంట్ లో ప్రస్తావించారో ఈ దేశ ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కనుమరుగు చేయడంలో భాగంగానే అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా పౌర సమాజం భావిస్తుందన్నారు.తక్షణమే అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కే వి పి ఎస్ జిల్లా అధ్యక్షుడు మొదుంపల్లి శ్రావణ్.నాయకులు సిపెల్లి రవీందర్. కుమ్మరి నవీన్. సిపెల్లి దిలీప్. శ్రీనివాస్ రెడ్డి. ఇమ్రాన్. సూరజ్. సిద్దార్థ. తదితరులు పాల్గొన్నారు.

### భారత రాజ్యాంగానికి ఇది ఘోర అవమానం

### అమిత్ షా వ్యాఖ్యలతో దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి




ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్ ): లోకసభ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా డా. బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ. అమిత్ షా ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ. అసెంబ్లీ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో. రాష్ట్ర మంత్రులతో మరియు సహచర ఎమ్మెల్యేలతో. ఎమ్మెల్సీలతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.

### మహిళా వ్యవస్థాపకత మరియు ఆర్థిక చేరికపై అంతర్జాతీయ సదస్సు: విజన్ విక్షిత్ భారత్ ఏ 2047కు మార్గాలు



హైదరాబాద్, (శుభోదయం న్యూస్): హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ఫిబ్రవరి 6 మరియు 7 2025 తేదీల్లో జరగబోయే ఐసిఎస్ఎస్ఆర్ ద్వారా స్పాన్సర్ చేయబడిన మహిళా వ్యవస్థాపకత మరియు ఆర్థిక చేరికపై అంతర్జాతీయ సదస్సు: విజన్ 2047కి మార్గాలు కోసం తయారుచేసిన గోడపత్రిక ను ఈ రోజు సిబిటిఐ ప్రిన్సిపల్ సి వి నరసింహులు, కన్వీనర్ డాక్టర్ ఎస్ సరస్వతి మరియు ఐమరియుఐ సలహాదారులు డాక్టర్ ఉమాకాంత చౌదరి విడుదల చేశారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఆర్థిక చేరిక విధానాలు మరియు వ్యూహాలపై నిపుణులు తమ అంతర్దృష్టులను పంచుకోవడానికి ఈ సమావేశం ఒక వేదికను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది మహిళా వ్యవస్థాపకత మరియు ఆర్థిక చేరికలను ప్రోత్సహించడంలో విజ్ఞానం, అనుభవాలు మరియు ఉత్తమ అభ్యాసాలను పంచుకోవడానికి నిపుణులు, పరిశోధకులు, విధాన రూపకర్తలు మరియు అభ్యాసకులనుఅంతర్జాతీయ సదస్సులో ఈ క్రింది అంశాలపై మీద చర్చించనున్నారు1. మహిళా వ్యవస్థాపకత2. ఆర్థిక చేరిక3. డిజిటల్ సాధికారత4. పాలసీ మరియు రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్

## టంగుటూరు గ్రంధాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అధికారి!




టంగుటూరు మండల రిపోర్టర్ :– వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :– స్థానిక గ్రంథాలయాన్ని ప్రకాశం జిల్లా గ్రంథాలయ అధికారి శ్రీమతి కాసు ఆదిలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు ఫైల్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులను గ్రంథాలయ సభ్యులుగా చేర్చి గ్రంథాలయ సెస్సు కట్టించాలన్నారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత అవసరమని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ నిర్వాహకులు గుమ్మడి వర్ధన్ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పట్టించుకునే నాథుడే లేడా

### ఇది ప్రభుత్వ ఉన్నత పాఠశాలా లేక బందల దొడ్డా?

### పాఠశాల హెడ్ మాస్టర్ లేకపోవడంతో బందల దొడ్డి కంటే హీనంగా తయారైన స్కూల్





తనకల్లు , మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్) : మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిస్థితి చూసే వారులేక చెప్పే వారు లేక పాఠశాల హెడ్ మాస్టర్ అందుబాటులో లేక అగమ్య గోచరంగా తయారైందని, కొంతమంది పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగా చర్చించుకుంటున్నట్లు సమాచారం. హెడ్ మాస్టర్ నెలకు ఒకసారి చుట్టంలాగ వచ్చి ఆలా వచ్చి వెళ్లిపోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా గతంలో స్కూల్ స్ట్రెంత్ సుమారు 1300 మందితో ఉన్న పాఠశాల విద్యార్థులు ఈరోజు సగానికి సగం అంటే 400 మంది విద్యార్థులు కూడా లేకపోవడం గమనార్హం ముఖ్యంగా విద్యార్థులకు సరైనటువంటి విద్యనుకానీ క్రమశిక్షణలో పెట్టాల్సిన పీఈటీలు గాని లేకపోవడంతో విద్యార్థులు మితిమీరు పోయి, పలు రకాల చెడు అలవాట్లకు బానిసలై పాఠశాలకు చెడ్డ పేరు తీసుకొస్తున్నట్లు మేధావులు చెప్పుకుంటున్న మాట.



ముఖ్యంగా మండలంలోని విశ్లేషకులు మాట ఏమిటంటే ఈ స్కూల్లో సరైన సదుపాయాలు లేవని సరైనటువంటి మార్గ నిర్దేశం చేసే వారు లేరని త ద్వారా అభం శుభం తెలియని విద్యార్థులు సైతం చెడు అలవాట్ల వైపు మక్కువ చూపిస్తున్నారని, ఇటీవల రెండు రోజుల కిందట స్కూల్ విద్యార్థి, విద్యార్థిని కనపడట్లేదు అని ఆ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక స్కూల్ కి వెళ్లి ఇన్చార్జ్ హెడ్మాస్టర్ కు అడగగా మా స్కూలుకు ఆ ఇద్దరు విద్యార్థులు రాలేదని, ఎక్కడ పోయారు మాకు తెలియదని చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఒకింత భయాందోళనలకు గురి కావాల్సివచ్చిందని, గతంలో కూడా ఈ పాఠశాలలో ఇలాంటి సంఘటనలు జరిగాయాలి, స్కూలులో చదువుకున్న విద్యార్థులు సాయంత్రం వరకు స్కూల్ లోపల ఉండాల్సిన వారు ఇంటర్వెల్ సమయంలో బయట కూడా తిరుగుతున్నారని, ఈ తిరగడం వలన బయట వ్యక్తులతో కలిసి తిరగడం వలన చెడు అలవాట్లకు దారితీస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపట్ల శ్రద్ధ వహించి నడుచుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని చూడరాని సంఘటనలు సైతం చూడడంలో ఎటువంటి సందేహం అవసరం లేదని మండలంలోని విశ్లేషకులు మాట. ఇప్పటికైనా విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి అబ్జర్వేషన్ లో పెట్టాలని మరియు ప్రస్తుత పాఠశాల హెడ్మాస్టర్ పైన చర్యలు తీసుకుని రెగ్యులర్ వచ్చే హెడ్ మాస్టర్ ఉండే విదంగా చూడాలని ఉన్నత అధికారులకు విద్యార్థుల తల్లితండ్రులు వేడుకొంటున్నట్లు సమాచారం.

## బైక్ ఢీకొని వ్యక్తి కి గాయాలు -వందేమాతరం టీమ్






జనసేన ఉచిత అంబులెన్స్ లో ఆసుపత్రిలో చేరిక. తనకల్లు (శుభోదయం న్యూస్) :తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ ఆమడగురు రోడ్డులో మబ్బువారిపల్లికి చెందిన రామస్వామి అనే వ్యక్తికి బైక్ ఆక్సిడెంట్ అయింది ఈ విషయం తెలుసుకున్న వందేమాతరం టీం సభ్యులు తక్షణమే జనసేన ఉచిత అంబులెన్స్ లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చడం జరిగింది. ఉచిత అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చిన వందేమాతరం సభ్యులు అశోక్ బాగేపల్లి, నవీన్ బక్కసం, సంకు వెంకటరమణ కు క్షతగాత్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



రెంటచింతల, మండల రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె నగేష్ సూచించారు. గురువారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులకు అభ్యంతరాలు ఉన్నట్లయితే దరఖాస్తులు చేసుకుంటే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రైతుల నుంచి వచ్చిన 23 దరఖాస్తులను స్వీకరించి ఆన్ లైన్ చేశారు. మిట్టగుడిపాడు గ్రామ శివారులోని పట్టా నెంబర్ 208 , సర్వే నెంబర్ 282/1 లోని తన పొలంలో గత 15 సంవత్సరాలుగా నెలకొన్న భూ సమస్యకు సంబంధించి రీ సర్వే కోరుతూ రెంటచింతలకు చెందిన ఏచూరి వెంకటసైదయ్య ఈ సందర్భంగా గ్రామ సభలో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు అందజేశారు. రీ సర్వే త్వరితగతిన చేపట్టి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.రెవెన్యూ సదస్సులో పాస్ బుక్ లకు సంబంధించి 4, 1బి–1, భూ సమస్యలకు సంబంధించి 23 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆర్ ఐ పల్లా రామకృష్ణ, సర్వేయర్ కల్యాణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆలయాలలో ధనుర్మాస పూజలు



రెంటచింతల, మండల రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : మండలంలోని వైష్ణవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెంటాలలోని చెన్నకేశవ ఆలయం, తుమృకోట వైష్ణవాలయం, రెంటచింతల సుబ్బన్న తోటలో గల వెంకటేశ్వర ఆలయం, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో తెల్లవారుజాముననే స్వామి,అమ్మవార్లకు



అభిషేకాలు, తిరుప్పావై సేవలు, అర్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహా నివేదన జరిపారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పాశుర హారతి, కుంభ నక్షత్ర హారతి సమర్పించారు. పద్మావతి సమేత వెంకటేశ్వర ఆలయంలో విశేష అష్టోత్తర శత సహస్రనామార్చన, గోదా అష్టోత్తర శతనామార్చన, తీర్థ గోష్టి నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్ కు విశేష అలంకారం, హారతి సమర్పించారు.ఆయా ఆలయాలలో మహిళలు పాశుర ప్రవచనాలు పారాయణం చేయగా, పలువురు భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి తో పాటు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతి... ఏపీస్ (జేపసీ)...
## ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి కిరణ్ యాదవ్




విజయనగర, జిల్లా ప్రతినిధి, బొద్దాన శ్రీనివాస్,(శుభోదయం న్యూస్):స్థానిక అంబేద్కర్ బొమ్మ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో రెండున్నర సంవత్సరాలుగా బీసీ బాలుల కళాశాల వసతి గృహాన్ని కోమటిపల్లి నుండి బొబ్బిలికి తీసుకురావాలని సొంత భవనం నిర్మాణం చేయాలని కార్యక్రమం చేశామని గత ప్రభుత్వం పట్టించుకోలేదని మీరేనా పట్టించుకోండి అని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అలాగే ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం పట్టించుకునే బొబ్బిలిలో ఉన్న ప్రేమ్ నగర్ వెనకాతల పాత బీసీ బాలుల పాఠశాల వసతి గృహాన్ని గత సంవత్సరం మూసి వేయడం జరిగింది. ఆ భవన సముదాయం ఇప్పుడు ఒక గది తప్ప పూర్తిగా వాడుకలో లేకుండా పోయింది కావున ఇప్పటికైనా ఈ ప్రభుత్వం విద్యార్థుల దృష్టిలో పెట్టుకొని అక్కడ బీసీ కళాశాల వసతి గృహాన్ని నిర్మాణం చేసి రాబోయే విద్యా సంవత్సరం జూన్ కల్లా విద్యార్థులకు అందుబాటులో తీసుకొస్తారని ఆయన అన్నారు అలాగే ఈ సమస్య పైన విద్యార్థి యువజన ప్రజా సంఘాలు అన్ని రాజకీయ పార్టీల్ని కలిపి కార్యక్రమం చేయడానికి ముందుకు పోతామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో బొబ్బిలి పట్టణ నాయకులు నందు చంద్రశేఖర్ పాల్గొన్నారు

## ఎమ్మెల్యే బేబీనాయన గారిని కలిసిన ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం నాయకులు..



విజయనగర, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్,(శుభోదయం న్యూస్):శ్రీ విజయ విశాఖ డైరీలో గత ప్రభుత్వ హయాములో జరిగిన అవినీతి, అన్యాక్రాంతమైన డైరీ ఆస్తులు, సహకార చట్టం నుంచి కంపెనీల చట్టానికి జరిగిన మార్పు విధానంపై న్యాయవిచారణ జరపాలని ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) నిన్న ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో కలిసి వినతిపత్రం అందజేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ , బి.రాంబాబు (పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు), గొంప కృష్ణమూర్తి (విజయనగరం జిల్లా పాల రైతు సంఘం కార్యదర్శి), గోపాలం. సురేష్ , ఆధ్వర్యంలో పాల రైతు సంఘం నాయకులు దిగువ పేర్కొన్న సమస్యలను శాసనసభ కమిటీ దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే బేబీనాయన గారుని కోరారు:- గ్రామ స్థాయిలో గల మిల్క్ ప్రొడ్యూసర్స్ సహకార సంఘాలను పాలసంఘ సభ్యులు అనుమతిలేకున్నా, పాల ఉత్పత్తి దారుల సంస్థలుగా మార్పు చేశారు. ఈ విధంగా చెయ్యడం చట్ట విరుద్ధం.- ?గ్రామ పాలఉత్పత్తి సేకరణ కేంద్రాలు జాయింట్ అకౌంట్ లావాదేవీలకు సంబంధించి చేసిన చట్టాన్ని పునః పరిశీలించాలి.పాల సేకరణ కేంద్రాలలో లోకల్ సేల్స్ మార్జిన్ ను సేకరణ కేంద్రాలకే కేటాయించాలి.(ఎస్ న్ ఎఫ్) వెన్న శాతాన్ని పరిశీలించే టెస్ట్ పరికరాలపై అనుమానాలు కలుగుతున్నందున గర్బోటెస్ట్, లాక్టోమీటర్ లను అందుబాటులో ఉంచాలి.- ?విశాఖ డైరీలో ప్రతి పాలసభ్యుడికి మెంబెర్ గా అవకాశం ఇవ్వాలి. - ?ఫీడ్ నాణ్యత పెంచాలి.- ?పాల సొసైటీలలో కొన్ని చోట్ల ప్రెసిడెంట్లు, అధ్యక్షులు పాలు పోయకపోయినా చలామణీ అవుతున్నారు.. ఇది సహకార స్ఫూర్తికి విరుద్ధం.

## పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించినవారు జాతీకి క్షమాపణ చెప్పాలి
## దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి




కావలి (శుభోదయం న్యూస్) :పార్లమెంట్‌లోఅంబేద్కర్‌ను అవమానించినవారు జాతీకి క్షమాపణచెప్పాలనిదళిత సంఘర్షణసమితిజిల్లాఅధ్యక్షులుశెట్టిపల్లి మల్లి డిమాండుచేశాడు. గురువారంకావలిపట్టణంలోని బ్రిడ్జిసెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్దనిరసన తెలిపారు. ఈసందర్భంగా మల్లి మాట్లాడుతూరెండురోజులక్రితం పార్లమెంట్‌లోచర్చజరిగిన సందర్భంగాకేంద్రహోమ్‌శాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్ గురించిఅవమానకరంగా మాట్లాడారనితెలిపారు. కాంగ్రెస్ పార్టీప్రతిరోజుఅంబేద్కర్‌ను భుజానవేసుకొనిమోస్తుంటారని, వీరికిఅంబేద్కర్ ఒకడుదొరికారని అమిత్‌షా కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించిఅంబేద్కర్‌ను అవమానకరంగామాట్లాడారని తెలిపారు. పాలకపార్టీ, ప్రతిపక్ష పార్టీఅంబేద్కర్ చిత్రపటాలను పట్టుకొనిఒకరునొకరు దూషించుకుంటున్నారన్నారు. వారువ్యక్తిగతంగా దూషించుకోవచ్చుకాని అంబేద్కర్‌నుమధ్యనపెట్టి దూషించడంభారతజాతికి అవమానంఅన్నారు. అంబేద్కర్ రాసినరాజ్యాంగంవలన 141కోట్ల మందిప్రజలుప్రశాంతంగా జీవిస్తున్నారని, అదిఅంబేద్కర్ కల్పించినహక్కులద్వారానే సాధ్యమైందని, అటువంటి మహానుబావుడిని అవమానకరంగామాట్లాడినందుకు అమిత్‌షా జాతికిక్షమాపణ చెప్పాలన్నారు. ఈవిదంగా మరొకసారిజరిగితే అధికారపార్టీకి బుద్ధిచెపుతామనితెలిపారు.పై కార్యక్రమంలో ఆలూరిబ్రహ్మయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు జరుగుమల్లివిజయరత్నం, రమేష్, జనార్ధన్, జితిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## లింగసముద్రం మండల తెలుగు యువతనాయకులు రమేష్ సతీమణి అనూష ఉదయగిరి నియోజకవర్గం నుండి టెలికం అడ్వైజరీగా నియామకం




లింగసముద్రం మండలం సురేష్( శుభోదయం న్యూస్ ):లింగసముద్రం మండల తెలుగు యువత నాయకులు లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెం గ్రామానికి చెందిన తోపూరి రమేష్ సతీమణి తాటికొండ అనూషను టెలికం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ గా ఉదయగిరి నియోజకవర్గం నుండి నియమించారు.ఈ సందర్భంగా రమేష్ అనూష దంపతులు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.తనపై నమ్మకాన్ని ఉంచి తనను డైరెక్టర్ గా నియమించేలా సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాకర్ల సురేష్ ను కలిసిన సందర్భంలో అనూషకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే సురేష్ తో కలిసి కేక్ కట్ చేశారు. అనూషకు పలువురు అభినందనలు తెలిపారు.

## నూతన కెనరా బ్యాంక్ భవనాన్ని ప్రారంభించిన తిరుపతి సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్




లింగసముద్రం మండలం సురేష్( శుభోదయం న్యూస్ ): కెనరా బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని పని చేయడం జరుగుతుందని కెనరా బ్యాంక్ తిరుపతి సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మితంతయ్య చెప్పారు.గురువారం మండల కేంద్రమైన లింగసముద్రంలోని కోటయ్య సమాధి సెంటర్లో మట్టే వారి కాంప్లెక్స్ లో ఏర్పాటుచేసిన నూతన కెనరా




బ్యాంక్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. మేళతాళాలతో, పూర్ణకుంభంతో సీనియర్ మేనేజర్ శేషగిరి ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.నూతన భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.గతంలో విజయలక్ష్మి థియేటర్ సమీపంలో ఉన్న కెనరా బ్యాంకును ఇక్కడికి మార్చడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కెనరా బ్యాంక్ మంచి సేవలందించి వారి మన్ననలు పొందుతుందన్నారు. మండలంలో మూడు గ్రామాల్లో కెనరా బ్యాంక్ సేవలు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఖాతాదారులందరూ బ్యాంకును ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రీజినల్ ఆఫీస్ ఏజీఎం అడారి నాగరాజు, బ్యాంక్ సీనియర్ మేనేజర్ సిహెచ్ శేషగిరి,మొగిలిచర్ల కెనరా బ్యాంక్ మేనేజర్ ఆర్ వి కె ప్రసాద్,తిమ్మారెడ్డి పాలెం కెనరా బ్యాంక్ మేనేజర్ జి.అవినాష్,బ్యాంక్ సిబ్బంది శ్రీకాంత్,పార్వతి,శశాంక్,మహేంద్ర,వెంకటేశ్వర్లు,మోహన్ రావు,ఏపిఎం సింహాద్రి రావు, వెలుగు సీసీలు, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి అమీత్ షా మాటలను ఖండించిన రాష్ట్ర దళిత రైట్స్ ఫెడరేషన్!



టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- ఇటీవల పార్లమెంట్లో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పట్ల ఆయన నామం పట్ల అమిత్ షా ప్రదర్శించిన అసహనాన్ని వ్యక్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర దళిత రైట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు మరియు రాష్ట్ర మానవుద్యోగుల సంఘం అధ్యక్షులైన తుల్లిబిల్లి అశోక్ బాబు గురువారం టంగుటూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో దళితులు ఎన్నో ఏళ్ల నుండి అనేకమంది దేవుళ్లను దేవతలను పూజించారని కానీ వారి అస్పృశ్యతను సామాజిక వెలివేతలను ఏ దేవుడు కాపాడలేదని అన్నారు. కేవలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం మాత్రమే తమ జీవితాలను కాపాడాయన్నారు.



ఇటీవల కాలంలో ప్రఖ్యాత సంగీత కళాకారుడు ఇళయరాజా ప్రఖ్యాత గాయకుడు జేసుదాసు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవిద్ లను దేవాలయాల్లోకి రాకుండా అవమానించారన్నారు. అదేవిధంగా ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ్ నూ పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి పి లువ లేదని గుర్తు చేశారు. ఈనాటికి కులాన్ని కనుగోవడానికి దేవాలయాల్లో గోత్రనామాలు అడుగుతున్నారని ఎద్దేవ చేశారు. రామమందిరం బాబ్రీ మసీదు వివాదాలకు కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే రక్షణ కల్పిస్తుందని అశోక్ బాబు పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ రావ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కే కృష్ణారావు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్పోర్ట్స్ పర్సన్ బి సతీష్ యన్ పేరయ్య ప్రశాంత్ శ్రీను సాయి తేజ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొనడం జరిగింది.

## బలవద్ర వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఇంచార్జి దద్దాల

కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్ ):చంద్రశేఖరపురం పట్టణం నందు బలవద్ర




పెద్దన్న బలబద్ర శాంతమ్మ గార్ల కుమార్తెసమీరా కళ్యాణ మహోత్సవంలో పాల్గోని నూతన వధూవు ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భువనగిరి వెంకటయ్య, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, ఎంపీటీసీ తిరుపతి రెడ్డి,మన్నేపల్లి పెద్దన్న, బత్తుల దేవరాజ్, మాజీ సర్పంచ్ పులిమి ఆదినారాయణ, సర్పంచి స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, బోయ మడుగు సర్పంచి బొట్ల చిరంజీవి,సంగిశెట్టి వాసు, బోయిన కొండయ్య, తోట రమేష్,సమీరా, సమీర్, ఎలికా, వినోద్, గొబ్బిళ్ళ శీను, నూకముల రాజశేఖర్ రెడ్డి,సంగటి మహేంద్ర, ఇస్రాయిల్,రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి- డిపో మేనేజర్ యం. సయానా బేగం.



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్) : ఆర్టీసీ అమలు చేస్తున్న కార్గో సేవలను ప్రజలు సద్వినియోగ చేసుకోవాలని కనిగిరి డిపో మేనేజర్ యం.సయానా బేగం గురువారం ఒక ప్రకటన లో తెలియజేసారు.ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడపపడుతున్న కార్కో పార్శిల్ మరియు కొరియర్ సర్వీస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆర్టీసీ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డిసెంబర్ 20వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు.కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 80 ముఖ్య పట్టణాల్లో డిపోకి 10 కిలోమీటర్లు విస్తరణలో ఈ డోర్ డెలివరీ సదుపాయం ఉందన్నారు. దీనిని ఉపమోగించుకొని 50 కేజీల వరకు కొరియర్లు, పార్శిల్ తక్కువ ఖ ర్చుతో అతి తక్కువ సమయంలో భద్రంగా సరుకు రవాణా సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## జీరో ఖాతాల నుంచి భూములకు విముక్తి కల్పించండి
## పట్టణంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి
## 167 బి హైవేలో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ విలువ కల్పించాలి



ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర (శుభోదయం న్యూస్) :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని గ్రామ సచివాలయం నందు తాసిల్దార్ బివి రమణారావు అధ్యక్షతన రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ జీరో ఖాతా లో పలు భూములు ఉన్నందున భూమి యజమానులు బ్యాంకు రుణాలకు, క్రయ విక్రయాలకు ఇతర అవసరాలకు ఉపయోగపడక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే 167 బి హైవేలో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం కల్పించాలని కోరారు. ముఖ్యంగా ఆధార్ అప్డేట్ కొరకు పట్టణం నుంచి ఇతర ప్రాంతాలకు పట్టణ ప్రజలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పామూరులోనే ఆధార్ అప్డేట్ సౌకర్యం కల్పించాలని మండల తాసిల్దార్ బివి రమణ రావు కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్ వినతులను పరిశీలించి పరిష్కారం చేసే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్, పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి



వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు పందిటి హరీష్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పిడుగు శ్రీనివాసులు, పామూరు సాగునీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య, నీరు కట్టు నాయబ్ రసూల్, వాయినేని రాఘవ, గుత్తి మహేష్, షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు

## స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్) :మానవసేవే మాధవసేవ అనే లక్ష్యంతో కనిగిరి చుట్టూ ప్రక్కన గ్రామాల్లోని, కనిగిరి పట్టణంలోని నిరాశ్రయులుకు నిరుపేదలుకు వితంతువులుకు ఆపదలో ఉన్నవారికి తన వంతు ఎప్పుడు సహాయ సహకారాలు అందిస్తూ నిస్వార్ధ సేవ చేస్తున్న స్నేహస్తం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డి సుధీర్ బాబు యొక్క సేవలో అభినందనీయమని కనిగిరి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె ఖాజావలి పేర్కొన్నారు గురువారం కనిగిరి స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సుధీర్ బాబు తల్లిదండ్రులైన కీర్తిశేషులు డి మోహన్ రావు వారి సతీమణి కృపమ్మ గార్ల జ్ఞాపకార్థం మరియు సెమీ క్రిస్మస్ పురస్కరించుకొని స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డి సుదీర్ బాబు అధ్యక్షతన కనిగిరి మండలంలోని గ్రామాల్లోని వితంతువులకు, వృద్ధులకు నా అనే వారిని కోల్పోయిన




నిరాశ్రయులకు వారికి చలికాలం ఉపయోగపడే విధంగా 600 మందికి రగ్గులు, అల్పాహారం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐ మాట్లాడుతూ మాట్లాడుతూ సమాజంలోని నిరుపేద వర్గాలకు వారి ఆకలి తీర్చడంలో వారి అవసరాలు తీర్చడంలో సుధీర్ బాబు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎటువంటి లాభాపేక్ష లేకుండా తన తన కష్టపడిన దాంట్లో తనకు వచ్చినటువంటి సంపాదనలో కొంత పేదలకు సహాయం చేయుట ఖర్చు చేయడం నిజంగా అభినందనీయమని సుధీర్ బాబు చేసే సేవా కార్యక్రమాలకు మా పోలీస్ శాఖ నుండి ఎప్పుడు సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు సాయి కృష్ణ మల్టీస్పెషల్టి హాస్పటల్ అధినేత డాక్టర్ పెరుగు మురళీకృష్ణ మాట్లాడుతూ సుధీర్ బాబు తో నాకు సుమారు పది సంవత్సరాల నుంచి పరిచయం ఉందని ప్రమాదంలో గాయపడిన వారికి రక్త నిల్వలు తక్కువ ఉండి ప్రసవయ్యే గర్భిణీ స్త్రీలకు వివిధ రోగాలతో బాధపడుతూ రక్తము అవసరమైన వారికి సుధీర్ బాబుకి మనం తెలియజేసినట్లయితే కచ్చితంగా సుధీర్ బాబు 10 నిమిషాల్లో వారికి సంబంధించినగ్రూపుకు సమకూర్చి వారి ప్రాణాలు కాపాడిన సంఘటనలు ఎన్నో ఉన్నదని మా హాస్పిటల్ ఎవరికైనా రక్త నిలువలు ఎవరికైనా అత్యవసరమైన సుధీర్ బాబు ఫోన్ చేసిన పది నిమిషాల్లో మాకు సమకూర్చి ఉంటాడని అలా ఎంతో మంది ప్రాణాలను మాకు తెలుసు కాపాడాడని వారి వద్ద నుండి ఒక్క రూపాయి కూడా సేకరించకుండా ఉచితంగా వారికి రక్తం అందజేస్తున్న వారికి మరో జన్మ ప్రసాదిస్తు మహనీయుడని సుధీర్ బాబు తో మాకు పరిచయం అంటేనే మేము చాలా గర్వంగా చెప్పుకుంటామని కరోనా కష్టకాలంలో ఎంతోమంది ప్రాణాలు కాపాడి రోడ్ల పక్కన బస్టాండ్ పక్కన ఆకలి దప్పుతో అలమటిస్తున్న వారికి కరోనా వైరస్ ని కూడా ఎదిరించి ప్రాణాలను కూడా లెక్క చేయకుండా వారికి అనేక సేవలందించాడని తప్పకుండా తనకి మనందరి ఆశీస్సులు కావాలని పేర్కొన్నారు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు ఒంగోలు బి వి సాగర్ మాట్లాడుతూ సుధీర్ బాబు చేసే సేవలను మనం ఎంత చెప్పినా తక్కువే అవుతుందని భగవంతుడు చెప్పినటువంటి నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే మంచి సూక్తిని పూర్తిస్థాయిలో అవలంబిస్తూ ఆచరిస్తూ కార్యాచరణలో పెట్టి పెట్టి కార్యక్రమాలుచేస్తూ ఉంటాడని కేవలం మానవమాత్రులకే కాకుండా వేసవికాలంలో చెరువులు కుంటలు ఎండిపోయి చుక్క నీరు లేక దాహార్తి తో చచ్చిపోతున్న పక్షులు మృగాలను కాపాడేందుకు అటవీ ప్రాంతంలో దాహానికి ఎదురుచూస్తున్న పక్షులకు మృగాలకు తన సొంత నిధులతో అటవీ ప్రాంతంలో వాటికోసం ఇనుప గూడులు ఏర్పాటు చేసి ప్రతిరోజు తన మిత్రబృందంతో కొన్ని కిలోమీటర్లు అటవీ ప్రాంతంలోకి వెళ్లి ఆ గూడు లో పక్షులకు మృగాలకు మంచినీరు నింపి వాటి దాహార్తి తీర్చే ప్రాణాలు కాపాడుతున్న మనసున్న మంచి మనిషి సుధీర్ బాబు, అతని యొక్క సేవా కార్యక్రమాలు ఎప్పుడు ప్రోత్సహిస్తూ తన వెన్నంటి ఉంటున్న తన సతీమణి శ్రీమతి, అనిత,కుమారుడు డి మోహన్ కుమార్ కుమార్తె మేరీ సునీత, సుధీర్ చేసే సేవా కార్యక్రమాలను వారు కూడా ప్రోత్సహిస్తూ వారి వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని వారిని అభినందించాల్సిన అవసరం ఉందని వారి యొక్క సేవా గుణాలను ప్రతి ఒక్కరు అవలంబించుకుని ఆచరణలో పెట్టినట్లయితే మన సమాజంలో ఉన్న నిరాశ్రయులు, నిర్భాగ్యులు, నిరుపేదలకు, మన వంతు సహాయ సహకారాలు అందించినట్లయితే అనేక మంది ప్రాణాలు కాపాడిన వారం అవుతామని అంతేగాకుండా బాలల హక్కులు బాలల అక్రమ రవాణా నిలుపుదల, పాఠశాల చదివి నిరుపేద పిల్లలకు ప్రతి సంవత్సరం వారికి కావాల్సిన పుస్తకాలు, పెన్ లు కొంతమంది నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించటంలో ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య సేవలు అందించడంలో నిరంతరం కృషి చేస్తూ ఉంటాడని సుధీర్ బాబు యొక్క స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియవల్సిన అవసరం ఉందని పేర్కొన్నారుదళిత హక్కుల వేదిక వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షులు మల్లికార్జున్, దానయ్య, తాతపూడి శ్యామ్ మాట్లాడుతూ సుధీర్ బాబు సేవలు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు ఈ కార్యక్రమంలో స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వివిధ సంఘాల పాస్టర్లు, ఆత్మీయమీడియా మిత్రులు,మమతా, రవణ, భారతి తదితరులు పాల్గొన్నారు

## రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### బి.వి.రమణారావుపువ్వాడి వెంకటేశ్వర్లుఉప్పలపాటి హరిబాబు



ప్రకాశం జిల్లా బ్యూరో –చంద్ర (శుభోదయం న్యూస్) :రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని రైతులు సంబంధిత వ్యక్తులు ఈ అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రెవిన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలని పామూరు తాసిల్దార్ బివి రమణారావు, టిడిపి పామూరు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఫోర్ మెన్ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఉప్పలపాటి హరిబాబు లు అన్నారు. రెవెన్యూ సదస్సు ను



ఉద్దేశించి వారు మాట్లాడుతూ పట్టాదారుడు మరణిస్తే భార్య, కుటుంబ వారసుల పేరిట భూపత్రాలను మార్చుకునేందుకు మ్యుటేషన్ చేయించుకోవాలని సూచించారు. పట్టా మార్పిడి వల్ల ప్రభుత్వపరంగా రైతు భరోసా, రాయితీ రుణాలు, విత్తనాలు, పంట, నష్టపరిహారాలు అందుతాయని తెలిపారు. ముఖ్యంగా భూ సమస్యలకు సంబంధించిన సమస్యలను దరఖాస్తు చేసుకుంటే సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో అరవింద రెడ్డి, పువ్వాడి వెంకటేశ్వర్లు, కొండిశెట్టి రమణయ్య, ఉప్పలపాటి హరిబాబు, ఆకుపాటి వెంకటేష్,మెంటా నరసింహారావు, పందిటి హరీష్, తడికమల్ల సుబ్బారావు, పిడుగు శ్రీనివాసులు, సుభాని, గుత్తి మహేష్, వాయినేని రాఘవ, షేక్ మస్తాన్, సాగునీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య, షేక్ గౌస్ బాషా, షేక్ ఖాజా రహమతుల్లా, సరాబు చంద్ర, రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## పాపుల రక్షణార్థమై యేసుక్రీస్తు మానవ రూపంలో ఈ లోకానికి వచ్చారు

### ప్రపంచ సువార్తికులు రెవ: గడ్డం వినయ్ కుమార్.




కనిగిరి రిపోర్టర్ జి.ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):పాపుల రక్షణార్థమై యేసుక్రీస్తు మానవ రూపంలో ఈ లోకానికి వచ్చారని ప్రపంచ సువార్తికులు రెవరెండ్ గడ్డం వినయ్ కుమార్ కొనియాడారు,గురువారం స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఏర్పాటుచేసిన కనిగిరి అమరావతి గ్రౌండ్స్ లో జరిగిన పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వాక్యోపదేశం చేశారు,ఈ సభకు రెవరెండ్ పాస్టర్ పాలపర్తి




యోషియా అధ్యక్షత వహించారు,సి.ఆర్.పి.ఎఫ్,సి.ఐ నేలపాటి రామయ్య వాక్యోపదేశం చేస్తు హృదయ అంతరంగాలను పరిశీలించేవాడు యేసయ్య అని అన్నారు,అనంతరం పాస్టర్ వినయ్ కుమార్,రామయ్య లను పాస్టర్ యేషీయాపాస్టర్,యేసుదాస్ పాస్టర్, నరసింహం పాస్టర్,శాంతి ఆంధ్ర పత్రిక ఎడిటర్ గురిజాల బాబురావు శాల్వాతో సన్మానించారు, క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని దైవ సేవకులకు బట్టలు పంపిణీ చేశారు, అదేవిధంగా వృద్ధులకు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ నాయకులు, కనిగిరి నియోజకవర్గం లోని 6 మండలాల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట రెవెన్యూ సమస్యల పరిష్కారం అభినందనీయం

### పాలపర్తి రమణయ్య (సాగునీటి సంఘం చైర్మన్)



ప్రకాశం జిల్లా బ్యూరో– చంద్ర (శుభోదయం న్యూస్):ఏళ్ల తరబడి వివిధ కారణాలతో పరిష్కారం జరగక జటిలంగా మారిన రైతుల భూముల సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం శుభపరిణామమని పామూరు సాగునీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య అన్నారు. గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం నందు జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు పలు సమస్యలను మండల తాసిల్దార్ బి వి రమణ రావు కు అర్జీల రూపంలో తెలియపరిచారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకొని వివాదాలకు గొడవలకు దారి తీసే రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి బిజెపి జనసేన నాయకులు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు



## ముగిసిన పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ శిక్షణ కార్యక్రమం!




టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- టంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య (ఏవో) సభాధ్యక్షత వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతవరం గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీమతి వి మాలతి ప్రభుత్వ పలు అభివృద్ధి అంశాలపై మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్జిసి ద్వారా వ్యవసాయ పనులు లేని కాలంలో వారికి వేతనం లభించే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన ద్వారా నిర్మాణ పథకం, డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణాలు ఇచ్చి సొంత ఉపాధి కుటుంబ జీవనానికి సంబంధించిన ఆదాయం సమ కూర్చుంటున్నారని తెలిపారు. అదేవిధంగా స్వచ్ఛభారత్ ద్వారా గ్రామీణ ప్రజలకు పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జల్జీవన్ మిషన్ ద్వారా పరిశుద్ధమైన నీరు ప్రజలకు ప్రభుత్వం అందిస్తుందని జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారాఆరోగ్యంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎం ఎన్ హెచ్ పి



ఏ ఎన్ ఎం ఆశ వర్కర్ల ద్వారా సకాలంలో వైద్యం అందిస్తూ ఎన్టీఆర్ వైద్య సేవ అందుబాటులో ఉందన్నరు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. స్కూల్స్ లో డ్రాప్ అవుట్ పిల్లలను తిరిగి బడిలో చేర్చడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అమలులో ఉందన్నారు. గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మాలతి తెలియజేయడం జరిగింది. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెచ్ ఇ ఓ శ్రీమతి టి సుమతి మాట్లాడుతూ ప్రైమరీ హెల్త్ గురించి జనంలోకి తీసుకెళ్లడానికి ఏ విధంగా ప్రజలకు చెబితే అర్థమవుతుంది అనే క్రమంలో ఐఇసి ప్రదర్శన ద్వారా ఆరోగ్య విద్యను తెలియజేయవచ్చునన్నారు. తద్వారా ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యం అందుబాటులో ఉంటుందని అభిప్రాయపడ్డారు. నులిపురుగులు శరీరంలో ఉండడం కారణంగా రక్తహీనత ఏర్పడి పోషకాహార లోపంతో బాధపడుతారని అనారోగ్యం బారిన పడడానికి పెద్ద సమస్య ఈ నులిపురుగులు శరీరంలో ఉండడమేనన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే అన్ని వయసుల వారికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల మాత్రలు సిరప్ లు తప్పనిసరిగా వాడాలన్నారు. ఇదిలా ఉండగా స్త్రీలలో ప్రధానంగా రక్తహీనత ఏర్పడకుండా ఉండాలంటే పోషక ఆహారంతో పాటు సప్లిమెంట్స్ టాబ్లెట్స్ రూపంలో శరీరానికి అందించినట్లయితే ఆరోగ్యవంతులుగా మారడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ప్రతి డిపార్ట్మెంట్ కు సంబంధించిన ఉద్యోగులందరూ ప్రాథమిక ఆరోగ్య సూత్రాలను గ్రామాల్లో ఉన్న ప్రజలకు చేరవేసే క్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఎందుకంటే మెరుగైన ఆరోగ్య అభివృద్ధి సాధించిన వాళ్ళమవుతామని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు విలేజ్ సెక్రటరీలు పశు సంవర్ధక శాఖ సహాయకులు వీఆర్వోలు తదితర శాఖలకు సంబంధించిన వారు పాల్గొనడం జరిగింది.

## మాలధారణ స్వాములకు అన్నదానం నిర్వహించిన మాజీ సింగల్ విండో చైర్మన్ బోయల్ల నారాయణరెడ్డి




పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ ((శుభోదయం న్యూస్):తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సింగల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి గురువారం స్థానిక పామూరు పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మాలధారణ స్వాములకు అయ్యప్ప స్వాములకు శివ



స్వాములకు భవాని స్వాములకు వెంకటేశ్వర స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో వరికూటి హనుమంతు దంపతులు వరికుటి చిరంజీవి గుత్తి రాజా కావిటి సుబ్బయ్య దేవస్థాన సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు

## కబ్జా కోరల నుంచి దేవుని భూములు కాపాడాలి

### కొండిశెట్టి రమణయ్య ఉమ్మడిశెట్టి శ్రీను



ప్రకాశం జిల్లా బ్యూరో –చంద్ర (శుభోదయం న్యూస్): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం,కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అదేశాలమేరకు!పామూరు గ్రామపంచాయతీ ఆవరణలో పామూరు మండల తహశీల్దార్ బి.వి.రమణారావు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు కనిగిరి నియోజకవర్గం కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య, ఉమ్మడిశెట్టి శ్రీను పాల్గొని పామూరు గ్రామంలో శ్రీ మదన వేణుగోపాల స్వామి, శ్రీ వల్లి సమేత భుజంగేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవస్థాన ఆస్తులు సంబంధించిన భూములు ఆన్లైన్ చేయాలని నేషనల్ హైవే విస్తరణ, నడికుడి కాళహస్తి రైల్వే విస్తరణ సంబంధించిన పరిహారం రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం వచ్చేటట్టు చేయాలని మరియు పామూరు గ్రామంలో అన్యాకాంతమై కబ్జా కోరల్లో చిక్కుకున్న బ్రహ్మంగారి మఠము, అనుమాల శెట్టి వారి సత్రము కబ్జాదారుల నుండి విముక్తి చేయాలని ఈ సదస్సులో మండల రెవెన్యూ అధికారి వారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి ఉమ్మడిశెట్టి శ్రీను, టిడిపి, జనసేన బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు



## దేవస్థాన భూములను అన్యకాంతం కాకుండా చూడండి ఈవో గిరి రాజు నరసింహ బాబు.




పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్):పామూరు పట్టణం లోని దేవస్థాన భూములను ఎట్టి పరిస్థితిలోనూ వదిలిపెట్టనని వాటిని తిరిగి దేవస్థానానికి చేర్చాలని ఎమ్మార్వో బి రమణరావు



కు వివరిస్తున్న దేవస్థాన ఈవో గిరిరాజు నరసింహ బాబు పామూరు పట్టణంలో దేవస్థానం సంబంధించిన పలు భూములు ఆక్రమించారని తిరిగి దేవస్థానానికి అప్పజెప్పాలని వారు ఎమ్మార్వో కి అర్జీ రూపంలో కోరారు ఆయన సానుకూలంగా స్పందించి దీనిపై పై అధికారులతో చర్చించి భూములను దేవస్థానికి అప్పజెప్తానని తెలియజేశారు

## రెవిన్యూ సదస్సును ప్రతి మేలు వినియోగించుకోవాలి టిడిపి నాయకులు పిడుగు శ్రీనివాసులు




పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):పామూరు:ఈరోజు 19.12.2024 తేదిన, రాష్ట్ర ప్రభుత్వం,కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గారి అదేశాలమేరకు!పామూరు గ్రామపంచాయతీ ఆవరణలో..."రెవెన్యూ సదస్సు నిర్వహించారు" ఈకార్యక్రమంలో



మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు జనసేన జిల్లా నాయకులు వై.రహిముల్లా, బిజెపి రాష్ట్ర నాయకులు కొండిశెట్టి రమణయ్య, పామూరు మండల తహశీల్దార్ బి.వి.రమణారావు,పామూరు పంచాయతీ కార్యదర్శి అరవింద రెడ్డి,పట్టణ టిడిపి ఫోర్మెన్ కమిటీ మెంబర్స్, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి,యస్.కె గౌస్ బాష, పందిటి హరీష్,పట్టణ బూత్ కమిటీ ఇంఛార్జ్ స్, మరియు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, శ్రేణులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కనిగిరి నూతన డిఎస్పిగా మహేశ్వరరావు నియామకం



కనిగిరి రిపోర్టర్ జి . ప్రసాదరావు(శుభోదయం న్యూస్): కనిగిరి డివిజన్ నూతన డిఎస్పీగా ఎం మహేశ్వరరావు నియమితులయ్యారు. శుక్రవారం కనిగిరి డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి ను న్నారు. గతంలో ఈయన విశాఖపట్నం, అనకాపల్లి లో విధులు నిర్వహించారు.బదిలీలలో భాగంగా నేడు కనిగిరి నూతన డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించను న్నారు.

## కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చి నందు సెమీ క్రిస్మస్ వేడుకలు.



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):కనిగిరి లో పామూరు బస్టాండ్ నందు గల కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చ్ ప్రాంగణంలోని ఫంక్షన్ హాల్ నందు కనిగిరి మున్సిపాలిటీ కో ఆప్షన్ నెంబర్ గూడూరి అబ్రహం లింకన్ గారి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘ కాపరులకు మరియు నిరుపేద కుటుంబాలకు గూడూరు అబ్రహం లింకన్ దంపతులు దుస్తులు పంపిణీ చేసినారు సదురు కార్యక్రమంలో సంఘ కాపరులు గూడూరి అబ్రహం లింకన్ బంధువులు మిత్రబృందం మరియు మదర్ సేవా సమితి సభ్యులు అందరి సమక్షంలో కేక్ కట్ చేసి విచ్చేసిన అందరికీ



సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియపరిచినారు సదురు కార్యక్రమానికి విచ్చేసిన వారికి భోజన వసతి కల్పించడం జరిగినది సదురు కార్యక్రమం పాస్టర్స్ రెవ గూడూరి జాన్ బంగారయ్య రెవ గూడూరి రవికుమార్ రెవ గూడూరి నేహా మయ్య రెవ కె .జోసెఫ్ సిద్ధార్థ్ రెవ పి.జేమ్స్ ఫాస్టర్స్ జీవరత్నం, యేసు రత్నం, యోహాన్ ,యాకోబు మరియు కుంచం జకరయ్య అధ్యక్షతన ఘనముగా దేవునికి మహిమకారముగా జరిగినది .ఈ కార్యక్రమం లో మదర్ సేవా సమితి గౌరవాధ్యక్షులు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ లోక మానవాళి రక్షణ కొరకు ఏసుప్రభు ఈ లోకమునకు వచ్చినారని ఆయన జీవితము సర్వమానవాళికి మార్గదర్శమని దాన్ని మార్గదర్శకంగా ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఇరుగుపొరుగు వారిని ప్రేమించడం సహాయ సహకారాలు అందించడం ఎదుటివారిని గౌరవించటం ముఖ్యమని తెలియపరచినారు ఈ కార్యక్రమంలో మదర్ సేవాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ఎన్ .రసూల్ పసుపులేటి అరుణోధర్ మదర్ సేవాసమితి సభ్యులైన ఆర్.ఎం.పీ డాక్టర్ డి.చెంచులు ,ఎల్.ఐ .సి నారాయణ , బొట్టు శీను మరియు మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్ పాల్గొన్నారు

## రాష్ట్ర విజనరీ లీడర్ తో కనిగిరి విజినరి లీడర్



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్):రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి కనిగిరి నియోజకవర్గంనకు సంబంధించిన అభివృద్ధి పనులు, ముఖ్యంగా ట్రిబుల్ ఐటీ, మౌలిక వసతుల కల్పనకై వినతి పత్రం అందజేసిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని ముఖ్యమంత్రి అన్నట్లు తెలిపారు.

## శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు సింగరాయకొండలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు.




శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా కార్డన్ & సెర్చ్ నిర్వహించిన ప్రకాశం పోలీసులు

సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):-ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 31 మోటార్ సైకిళ్లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు.ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ ఏఆర్ దామోదర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 75 మంది పోలీస్ సిబ్బంది, అత్యాధునిక డ్రోన్ కెమెరా మరియు డాగ్ స్క్వాడ్ సహాయంతో గురువారం తెల్లవారు జామున సింగరాయకొండలోని బాలిరెడ్డి నగర్ కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ తనిఖీల్లో అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల ఇళ్లు, గ్రామ శివార్లు, ముఖ్య కూడళ్లు, మరియు పలు షాపులలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 32 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.నేర నియంత్రణకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసు శాఖకు ప్రజల సహకారం అవసరం అని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాల గురించి ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112/100కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, ఒంగోలు సబ్ డివిజన్ ఎస్సైలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అరటి సాగులో మెలకువలు తెలియజేసిన వ్యవసాయ అధికారులు



యాడికి డిసెంబర్ 19 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్):మండలంలోని చందన గ్రామం నందు ఉద్యాన శాఖ అధికారిని ఉమాదేవి ఆధ్వర్యంలో అరటి పంట యాజమాన్య పద్ధతులు శిక్షణ కార్యక్రమం గురించి రేకులకుంట వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అరటిలో శిగటోక ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. కావున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని తెలియజేశారు. శిగటోక ఆకుమచ్చ తెగులు లక్షణాలు : ఆకులపై మొదట సమాంతర చిన్నచిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. అవి క్రమేపీ పెరిగి పెద్దవై బూడిద రంగుతో ఉంటాయి. ఈ మచ్చలు గోధుమ రంగులోకి మారి పరిమాణంలో పెద్దవై ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. ఈ మచ్చలు ముందుగా ఆకులతో ప్రారంభమై క్రమేనా పై ఆకులను ఆశిస్తాయి .తెగులు ఉధృతి పెరిగినప్పుడు మచ్చలు కలిసిపోయి ఆకులు



మొత్తం ఎండిపోతాయి. కిరణజన్య సంయోగ క్రియకు అవసరమైన పచ్చదనం లేకపోవడం వలన మొక్కలు గెలలు వేసినప్పుడు అవి పండక ముందే కాయలు రాలిపోతాయి. నివారణ చర్యలు : తోటలో కలుపు లేకుండా జాగ్రత్త తీసుకోవాలి. నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరుచుకుని తోటలలో మీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. తెగులు వ్యాప్తి మొదలైనప్పుడు మొదటి పిచికారి : ప్రోపికోనజోల్ (1 మిల్లీలీటరు లీటర్ నీటికి ) రెండవ పిచికారి : కార్బండజిమ్ ం మాంకో జెబ్ మిశ్రమ మందు (1గ్రాము లీటర్ నీటికి ) మూడవ పిచికారి : ట్రైఫ్లోక్సి స్ట్రోబిన్ ం టెబ్యూ కొనజోల్ మిశ్రమ మందు (1.4 గ్రాములు లీటర్ నీటికి నాలుగవ పిచికారి : డైపన్ కొనజోల్ (1 మిల్లీలీటరు లీటర్ నీటికి )ప్రతి పిచికారిలో స్టిక్కర్ కానీ సబ్బు పొడిని కానీ కలపవలెను. పైన తెలిపిన తెగుల మందులను గెలలు కోయడానికి 45 రోజుల ముందుగా మాత్రమే పిచికారి చేయాలి లేదంటే కాయలలో మందుల విశేషాలు మిగిలిపోయే ఆస్కారం ఉంటుంది అని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో చందన గ్రామం సర్పంచు గుర్రం నారాయణమ్మ గారు మరియు చందన లక్ష్యంపల్లి గ్రామ రైతులు చందన రైతు సేవ కేంద్రం అధికారి యతీష, విహెచ్ఎ సోమనాథ్, రైతులు పాల్గొన్నారు.

## అవగాహన సదస్సు మీ, పిల్లలను స్కూల్ కి పంపించండి

### బొబ్బిలి టౌన్ ఇన్స్పెక్టర్ కే సతీష్ కుమార్.



విజయనగరం,జిల్లా ప్రతినిధి,బొద్దాన శ్రీనివాస్,(శుభోదయం న్యూస్):బొబ్బిలి మున్సిపాలిటీ లో గల, ఇందిరమ్మ కాలనీలో బొబ్బిలి టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే,సతీష్ కుమార్ ఆధ్వర్యంలో యానాదుల (ఎస్టి) కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. పిల్లల తల్లిదండ్రులకు సిఐ గారు దిశ నిర్దేశం చేస్తూ, పిల్లలు పట్ల జాగ్రత్త వహించవలసిందడిగా సూచించారు. పిల్లలను చదివించమని, వారిని బయటపనికి పంపించవద్దని తెలిపారు. ఎటువంటి తప్పుడు మార్గాలలో వెళ్లకుండా, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండమని చెప్పారు. పట్టణంలో పలు చోట్ల నిఘా ఉందని, అలానే ఇకనుంచి ఇందిరమ్మ కాలనీ మీద దృష్టి పెడతామని (సిఐ)కే.సతీష్ కుమార్ హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బేబీ నాయన గారి అభిమాని,బోను గంగరాజు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయ షాపుల లెక్కలు చెప్పండి...!



పార్వతీపురం మండల (శుభోదయం న్యూస్):పరిషత్ కార్యాలయానికి ఉన్న షాపుల లెక్కలు చెప్పాలని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. గురువారం పార్వతీపురం ఎంపీడీవో కార్యాలయంలోని అధికారి ఫల్గుణ సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు ఇవ్వాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న షాపుల అద్దెకు/లీజుకి ఇచ్చే విషయంలో అవకతవకులు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. షాపులు కేటాయింపులోనే కొంతమంది పలుకుబడి కలిగిన వారు వాటిని చేజిక్కించుకున్నట్లు తెలిసింది అన్నారు. చేజిక్కించుకున్న వారిలో కొంతమంది సక్రమంగా అద్దెలు చెల్లించటం లేదని తెలిసిందన్నారు. మరి కొంతమంది ఇతరులకు అధ్యలికిస్తూ లాభపడుతున్నట్లు తెలిసింది అన్నారు. పట్టణ మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న డిమాండ్ ను బట్టి షాపులకు నిర్ణయించాల్సిన అద్ది కాకుండా తక్కువకు నిర్ణయించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో కార్యాలయానికి ఆవరణలో ఉన్న మొత్తం షాపులు, వాటి నిర్మాణానికి ఆయన ఖర్చులు, వాటిపై వచ్చిన ఆదాయము, ఆ ఆదాయ పరిస్థితిపై వివరాలడిగినట్లు తెలిపారు. అంతేకాకుండా ఎవరైనా అద్దిబకాయలు ఉంటే వారిపై తీసుకున్న చర్యలు గూర్చి కూడా అడిగినట్లు తెలిపారు. అలాగే షాపులు ఎవరెవరికి కేటాయించారు వారి వివరాలు కూడా అడిగినట్లు తెలిపారు. పట్టణ మెయిన్ రోడ్డు కు ఆనుకొని ఉన్న షాపులను కొంతమంది తమ పలుకు పెడుతూ కైవసం చేసుకొని, తమ ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటి లెక్కలు తేల్చేందుకే సమాచార హక్కు చట్టంలో ఆయా షాపుల లెక్కలు కోరినట్లు ఆయన తెలిపారు. ఓపెన్ ఆక్షన్ లో ఆయా షాపులను ప్రస్తుత అద్దెలు నిర్ణయించి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలని ఆయన కోరారు. అలాగే ఇంతవరకు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## చెంచులక్ష్మీపురంలో ఉచితవైద్యశిబిరం



బిట్రగుంట(శుభోదయం న్యూస్): కోవూరుపల్లిప్రాథమికఆరోగ్య కేంద్రంపరిధిలోని బోగోలుమేజర్ పంచాయితీ చెంచులక్ష్మీపురంలో గురువారంప్రభుత్వవైద్యాధికారులు ఉచితవైద్యశిబిరం నిర్వహించారు. ఇటీవల కాలంలోగ్రామంలోనిపలువురు విషజ్వరాలు చికెన్ గున్యాలాంటి వ్యాధులబారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో స్పందించినవైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ రాజశేఖర్ తమసిబ్బందితో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులకువైద్యపరీక్షలు నిర్వహించిఅవసరమైన మందులుఉచితంగాపంపిణీ చేశారు. పైకార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ పట్టణఇంచార్జ్ చిలకపాట వెంకటేశ్వర్లు, పంచాయతీకార్యదర్శిఅబ్దుల్ జహీర్, ఎంఎల్ హెచ్ పిలు తిరుమలయ్య, శివప్రసాద్ ఏఎన్ఎంలు జోత్స్న,రోజులిన్, ఆశాకార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు


నార్పల నడిమిదొడ్డిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు.సదస్సులో తహసిల్దార్ అరుణకుమారి, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్ మూర్తి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో సర్వేర్ బ్రహ్మయ్య, ఆర్ఐ జ్యోతి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## తటస్థ వేదికల్లో ఇండియా వర్సెస్ పాకిస్థాన్.



. చాంపియన్స్ ట్రోఫీకి ఐసీసీ లైన్ క్లియర్ ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ జట్లు ఇక నుంచి తటస్థ వేదికలపై ఫైట్ చేయనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం నెలకొన్న ప్రతిష్టంభన దీంతో తొలగిపోయింది. ఆ టోర్నీ నిర్వహణకు ఐసీసీ నుంచి క్లియరెన్స్ వచ్చేసింది. తటస్థ వేదికల్లో ఇండియా వర్సెస్ పాకిస్థాన్.. చాంపియన్స్ ట్రోఫీకి ఐసీసీ లైన్ క్లియర్దుబాయ్: భారత్ వర్సెస్ పాకిస్థాన్అంటేనే హైవోల్టేజ్ సమరం. అయితే ఇక నుంచి ఆ రెండు దేశాలు తటస్థ వేదికలపై పోరాడనున్నాయి. దీనిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో వచ్చే ఏడాది పాకిస్థాన్లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా ఐసీసీ లైన్ క్లియర్ చేసింది. ఇక నుంచి పాకిస్థాన్, ఇండియా మధ్య జరిగే వన్డే మ్యాచ్‌లను తటస్థ వేదికలపై నిర్వహించనున్నట్లు ఐసీసీ ప్రకటించింది. 2024 నుంచి 2027 మధ్య ఐసీసీ నిర్వహించే అన్ని టోర్నీల్లో.. భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే మ్యాచ్‌లన్నీ తటస్థ వేదికలపై జరుగుతాయని ఐసీసీ తన స్టేట్మెంట్‌లో పేర్కొన్నది. అయితే 2028లో పాకిస్థాన్‌లో జరిగే మహిళల టీ20 వరల్డ్‌కప్‌కు కూడా ఈ నిబంధన వర్తించనున్నది.ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన ఇండియా మ్యాచ్‌లన్నీ యూఏఈలో జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తాజా ఒప్పందం ప్రకారం.. వచ్చే ఏడాది భారత్‌లో జరిగే మహిళల ప్రపంచ కప్, 2026లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌లోని భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లు తటస్థ వేదికల్లో జరగనున్నాయి. 2008 ముంబై ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరగలేదు. వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను త్వరలో రిలీజ్ చేయనున్నట్లు ఐసీసీ వెల్లడించింది.2017లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీని పాకిస్థాన్ గెలుచుకున్నది. దాన్ని ఇప్పుడు ఆ దేశం డిఫెండ్ చేసుకోనున్నది. ఆ టోర్నీలో 8 దేశాలు ఆడనున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఇండియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ ఉన్నాయి.

## సపోర్ట్ స్టాఫ్‌తో సరదాగా అశ్విన్..



బీసీసీఐ సపోర్ట్ స్టాఫ్‌తో అశ్విన్ సరదాగా గడిపేవాడు. నెట్ ప్రాక్టీస్ టైంలో ఫన్ క్రియేట్ చేసేవాడు. రిటైర్మెంట్ ఇచ్చిన అశ్విన్‌పై బీసీసీఐ ఓ వీడియోను పోస్టు చేసింది. న్యూఢిల్లీ: రవిచంద్రన్ అశ్విన్).. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. అత్యధిక వికెట్లు తీసిన రెండవ భారత సిన్నర్‌గా అతని పేరిట రికార్డు ఉన్నది. ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్ టెస్టు ముగియగానే అతను తన రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇవాళ ఉదయం అశ్విన్ స్వంత పట్టణం చెన్నై చేరుకున్నాడు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం దక్కింది. అయితే బీసీసీఐ ఇవాళ తన ఎక్స్ పోస్టులో ఓ వీడియోను పోస్టు చేసింది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఎప్పుడూ సరదాగా ఉండే అతను.. సపోర్టు స్టాఫ్‌తో ఫన్నీ మూమెంట్స్ గడిపాడు. జట్టు సభ్యులు, సపోర్ట్ స్టాఫ్‌తో నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న అశ్విన్ వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. ఫీల్డ్‌పై అశ్విన్ పోరాటం చిరస్మరణీయమని, సపోర్ట్ స్టాఫ్‌తోనూ అతను ఇలా గడిపారంటూ తన ట్వీట్‌లో బీసీసీఐ తెలిపింది.38 ఏళ్ల అశ్విన్ 106 టెస్టుల్లో 537 వికెట్లు తీసుకున్నాడు. కుంబ్లే 619 వికెట్లు తీశాడు. ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్, ట్రైనర్ సోహమ్ దేశాయ్, అనలిస్టు హరి ప్రసాద్ మోహన్, మసార్ అరుణ్ కన్నడేతో కలిసి అశ్విన్ నెట్స్‌లో సరదాగా గడిపాడు. వారితో స్పిన్ బౌలింగ్ వేయించాడు.

## ఫెడ్ ఛైర్ నర్మగర్భ వ్యాఖ్యలు..



నష్టాలతో ముగిసిన సూచీలు.. బ్యాంక్, ఐటీ షేర్ల పతనం..! యూఎస్ ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ పావెల్ జెరోమ్ నర్మగర్భ వ్యాఖ్యల ఫలితంగా అంతర్జాతీయ, జాతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. ఫెడ్ ఛైర్ నర్మగర్భ వ్యాఖ్యలు.. నష్టాలతో ముగిసిన సూచీలు.. బ్యాంక్, ఐటీ షేర్ల పతనం..! యూఎస్ ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ పావెల్ జెరోమ్ నర్మగర్భ వ్యాఖ్యల ఫలితంగా అంతర్జాతీయ, జాతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. కేవలం రెండు సార్లు మాత్రమే వడ్డీరేట్ల కోత ఉంటుందని ఫెడ్ రిజర్వ్ పేర్కొన్నది. దీంతో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీల్లో షార్ప్ కరెక్షన్ చోటు చేసుకుంది. ఫలితంగా రెండు సూచీలు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు 25 బేసిక్ పాయింట్లు తగ్గించినా, భవిష్యత్‌లో ఏమైనా జరుగొచ్చునన్న సంకేతాల మధ్య ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగారు. ఫలితంగా బీఎస్ఆ-30 ఇండెక్స్ సెన్సెక్స్ టేడింగ్ ముగిసే సమయానికి 965.15 (1.20 శాతం) పాయింట్లు కోల్పోయి, 79,218.07పాయింట్ల వద్ద నిలిచింది. అంతర్గత ట్రేడింగ్‌లో 79,516.70 పాయింట్ల నుంచి 79,218.05 పాయింట్ల కనిష్ట స్థాయి మధ్య తచ్చాడింది.మరోవైపు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ-50.. 247.15 పాయింట్లు నష్టంతో 23,951.70 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్ లో 24,004.90 పాయింట్ల నుంచి 23,870.30 పాయింట్ల మధ్య తచ్చాడింది.ఎన్ఎస్ఈలో 36 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్ సర్వ్, ఏషియన్ పెయింట్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, గ్రాసిమ్ తదితర స్టాక్స్ 2.33 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్, సిప్లా, బీపీసీఎల్, సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్ తదితర 14 స్టాక్స్ 4.04 శాతం వరకూ లబ్ధి పొందాయి. నిఫ్టీ మిడ్ క్యాప్-100 0.28, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 0.51 శాతం నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ ఫార్మా, హెల్త్ కేర్ లాభాలతో స్థిర పడ్డాయి. మరోవైపు బ్యాంక్ స్టాక్స్, ఐటీ, ఫైనాన్సియల్ సర్వీసెస్, కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్ తదితర ఇండెక్సులు ఒక శాతం చొప్పున నష్టపోయాయి.సెన్సెక్స్-30లో సన్ ఫార్మా, హిందూస్థాన్ యూనీ లివర్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లాభ పడ్డాయి. మరోవైపు బజాజ్ ఫిన్ సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంకు షేర్లు పతనం అయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 2635 డాలర్లు పలికితే, బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 73 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది. ఇక ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ పై రూపాయి మారకం విలువ జీవిత కాల కనిష్టం రూ.85.08 వద్ద స్థిర పడింది.

## అమిత్ షా రాజకీయాల నుంచి తప్పుకోవాలి



పాట్నా : పార్లమెంటు సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభలో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. తాజాగా అమిత్ షా వ్యాఖ్యలపై ఆర్‌జెడి (రాష్ట్రీయ జనతాదళ్) చీఫ్ లాలూ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అమిత్‌షాకు పిచ్చిపట్టింది. ఆయనకు అంబేద్కర్ పట్ల ద్వేషం ఉంది. ఆయన చేసిన పిచ్చి వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాజ్యాంగ వ్యూహకర్త అంబేద్కర్ చాలా గొప్పవాడు. ఆయనపై అలాంటి వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజకీయాల నుంచి వైదొలగాలి' అని లాలూ యాదవ్ అన్నారు. ఇక బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వియాదవ్ కూడా అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమిత్ షా, ఆయన పార్టీ బిజెపి రాజ్యాంగ వ్యతిరేకం. వారు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారు అని తేజస్వియాదవ్ మండిపడ్డారు. గురువారం బీహార్ శాసనసభ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. 'బాబాసాహెబ్ అంబేద్కర్ మా ఫ్యాషన్. ప్యాషన్. ఆయన మాకు ప్రేరణ, స్ఫూర్తినిచ్చే వ్యక్తి. అలాంటి వ్యక్తిని మేము అవమానించనివ్వం. ఇలాంటి వ్యక్తులు విద్వేషాన్ని వ్యాప్తి చేసే రాజ్యాంగ వ్యతిరేకులు. అంబ్కేదర్ గురించి పార్లమెంటులో అమిత్‌షా ఉపయోగించిన భాష తీవ్రంగా ఖండించాలి' అని ఆయన అన్నారు.

## దేశవ్యాప్తంగా పెరిగిన చలి తీవ్రత



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా చలిగాలులు పెరగడంతో పాటు దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఉత్తర,. దక్షిణాది రాష్ట్రాలను సైతం చలి గాలులు వణికిస్తున్నాయి. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 0 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల నుండి 4 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గినట్లు తెలిపింది. మధ్యప్రదేశ్‌లో సైతం కనిష్ట ఉష్ణోగ్రత 7డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. గ్వాలియర్‌ను దట్టమైన పొగమంచు, చలి చుట్టుముట్టాయి. పొగమంచు కారణంగా విజిబిలిటీ (దృశ్యమాన్యత) పడిపోయిందని ఐఎండి తెలిపింది. మరోవైపు, రాబోయే ఐదు నుండి ఏడు రోజుల్లో వాయువ్య భారత్‌లోని పలు రాష్ట్రాలపై తీవ్ర చలిగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. చలిగాలుల ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపైనా పడింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కర్ణాటకలోనూ ఉష్ణోగ్రతలు 5 నుండి 6 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో రాష్ట్రంలో ఇంత తక్కువ ఉష్ణోగ్రతలు రికార్డు కావడం ఇదే మొదటిసారి అని స్థానికులు పేర్కొన్నారు. కర్ణాటకలో 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది.

## పార్లమెంటు ఆవరణలో ఉద్రిక్తత..



న్యూఢిల్లీ : పార్లమెంటులో ఆవరణలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. అంబేద్కర్‌ను అవమానించారంటూ పరస్పరం విమర్శలకు దిగాయి. ఇరు పక్షాల నిరసనలతో పార్లమెంటు ప్రాంగణం హోరెత్తుతోంది. పార్లమెంటు లోపలికి వెళ్తున్న ఎంపిలను ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. ఒడిశా ఎంపి ప్రతాప చంద్ర సారంగికి గాయాలయ్యాయి. స్వల్ప గాయాలైన ఆ ఎంపిని సహచర సభ్యులు ఆస్పత్రికి తరలించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నెట్టేశారంటూ అధికార పక్షం ఆరోపించింది. దీంతో పార్లమెంట్ ఆవరణలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్లమెంట్ ఉభయ సభలు మధ్యాహ్నం 2.00 గంటలకు వాయిదా పడ్డాయి. అధికార పక్షాల ఆరోపణలపై రాహుల్ గాంధీ స్పందించారు. తాను లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా బిజెపి ఎంపిలు తనను అడ్డుకున్నారని, బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. తనను దూరంగా నెట్టేశారని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కూడా నెట్టేశారని అన్నారు. పార్లమెంటు లోపలికి వెళ్లేందుకు తమకు హక్కు ఉందని, రాజ్యాంగంపై వారు దాడి చేస్తున్నారని అన్నారు. ఇది మొత్తం మీ కెమెరాల్లో రికార్డై ఉంటుందని అన్నారు.

## కోల్‌కతా హైకోర్టుకు బాధితురాలి తల్లిదండ్రులు



కోల్‌కతా : దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసిన కోల్‌కతా అభయ కేసులో తాజా దర్యాప్తు కోరుతూ బాధితురాలి తల్లిదండ్రులు గురువారం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. కొనసాగుతున్న దర్యాప్తుపై విశ్వాసం లేదని, తాజా దర్యాప్తుకు దిశానిర్దేశం చేయాలంటూ కోర్టును కోరారు. ఈ కేసును విచారిస్తున్న సిబిఐని పిటిషన్‌లో పార్టీగా చేర్చి, సోమవారం కోర్టు ముందు ఈ విషయాన్ని మరోసారి ప్రస్తావించాలని జస్టిస్ తీర్థాంకర్ న్యాయవాదిని ఆదేశించారు. ఈ ఏడాది ఆగస్టులో కోల్‌కతాలోని ఆర్.జి.కర్ ఆస్పత్రి ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. ఈ కేసులో ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ అభిజిత్ మండల్‌కు డిసెంబర్ 13న సీల్దాహ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 90 రోజుల చట్టబద్ధమైన వ్యవధిలో సిబిఐ వారిపై చార్జ్‌షీట్లు దాఖలు చేయడంలో విఫలమైందని వారి తరపు న్యాయవాదులు వాదించడంతో.. కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది.

# కాంగ్రెస్ ఏడాది పాలన ఎటమటమే!



డిసెంబర్ 7తో ఏడాది పూర్తి చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై మీడియా స్పందన ఇప్పుడు చర్చనీయాంశమే. కాంగ్రెస్ పాలన, నిర్ణయాలపై విశ్లేషకులు తమ అభిప్రాయాలను ఎప్పటికప్పుడు వ్యక్తం చేస్తున్నా ఏడాది అనేది ఒక మైలురాయి. అందుకే, తెలంగాణలో గత పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న వ్యత్యాసాలపై చర్చించుకొనే సమయం ఇది. ఏ కొత్త ప్రభుత్వానికైనా తొలి ఏడాది కీలకమైనది. ఎన్నికల్లో గెలిపించిన ప్రభుత్వం తీసుకొనే ప్రతి నిర్ణయంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. కొత్త ఉత్సాహంలో ఉన్న ప్రభుత్వాలు కూడా ప్రజల్లో ఉన్న అనుకూల ముద్రను కాపాడుకునేందుకు తాపత్రయపడతాయి. డిసెంబర్ తొలి రెండు వారాల్లో చాలా పత్రికలు రేవంత్ ఏడాది పాలనపై ప్రత్యే క కథనాలు ప్రచురించాయి. తాము 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 42 లక్షల గృహిణులకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. అయితే, ఇవి అర్ధ సత్యాలే. రైతు రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, రైతుభరోసా లాంటివి సంపూర్ణంగా అమలు కాలేదు. వీటిలో కొన్ని సగం కూడా పూర్తికాకపోగా మరికొ న్ని మొదలే కాలేదు. స్త్రీలకు నెలకు రూ.2,500, వృద్ధాప్య పింఛను రూ.4,000 హామీ ఊసే లేదు. నెలవారీగా ఇచ్చే ఆర్థికసాయం వెంటనే ఇస్తే ఆ హామీకి పరమార్థం ఉంటుంది. రేవంత్‌కు పాలనతో పాటు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ప్రసన్నంగా ఉంచడమూ కీలకం. 'గాంధీ'ల మనసు మారిందంటే పదవికి మంగళమే. అందుకోసం చిన్న విషయానికీ ఢిల్లీ వెళ్లడం, తెలంగాణలో ఆ తల్లీ కొడుకులకు మర్యాద తగ్గకుండా చూసుకోవడం ఆయనకు అతి ముఖ్యమైనదని ఒక పత్రిక పేర్కొన్నది. 'పాలనను అంచనా వేయడానికి ఒక ఏడాదికాలం తక్కువే అయినా కాంగ్రెస్ హామీల దృష్ట్యా ఇది కీలకమే' అని ది హిందూ అభిప్రాయపడింది. మాజీ సీఎం కేసీఆర్‌పై పలు ఆరోపణలు చేస్తూ ఎన్నికల్లో నెగ్గిన రేవంత్‌రెడ్డి తానేంటో నిరూపించుకొనే సమయమిదేనని.. ఆర్థిక హామీ లు నెరవేర్చడంలో విఫలమవుతూ, గత ప్రభు త్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందనే నెపంతో కాలహరణ చేయడం తగదని ఈ పత్రిక పేర్కొన్న ది. హామీల పట్ల నిబద్ధత, పాలనాపరమైన విధి విధానాల్లో పారదర్శకత లోపించిందని, రాబో యే నాలుగేండ్లు మరింత కఠినంగా గడుస్తాయని కూడా ఇందులో పేర్కొన్నది. 'రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో ఎన్నికల హామీ ల విషయంలో ప్రధాన ప్రతిపక్షం నుంచి నిరంత ర విమర్శలను ఎదుర్కోక తప్పలేదు' అని హిం దుస్థాన్ టైమ్స్ రాసింది. అయితే, 'బయటినుం చి కాకుండా కాంగ్రెస్ సీనియర్ నేతలతోనే ఆయన కు ప్రమాదం పొంచి ఉన్నది. గతంలో మంత్రులుగా పనిచేసిన వారిని పక్కనబెట్టి ఎన్నడూ మం త్రి పదవి చేపట్టని రేవంత్‌ను ఏకంగా సీఎం కుర్చీపై కూర్చోబెట్టడం అరుదైన సందర్భమే. ఆ కొనసాగింపుపై అధిష్ఠాన దీవెనలు ఆయనకు ముఖ్యం. ఆ వైపు కూడా రేవంత్ ఏ మాత్రం తగ్గని విధేయత ప్రదర్శిస్తున్నారు. తోటి మంత్రులతోనే కాకుండా అధికారులతో కూడా రేవంత్‌కు తగిన సహకారం అవసరం. గత పదేండ్లు కేసీఆర్ నమూనా పాలనలో కొనసాగిన అధికారులు రేవంత్ పట్టాలపై ఎక్కేందుకు సమయం పడుతుంది. ప్రత్యేకంగా ఆర్థిక, ప్రణాళిక శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు రేవంత్ హామీల సాధ్యాసాధ్యాలపై అవగాహన ఉంటుంది. హామీల ప్రాధాన్యతాక్రమంపై వారి సలహాలు అవసరం' అని ఈ పత్రిక పేర్కొన్నది. 'ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి తీసుకున్న ప్రతి నిర్ణయం, హామీ అమలు ఏదైనా నిజాయితీగా, విమర్శలు లేకుండా సాగడం లేదు. అసంపూర్ణ రైతు రుణమాఫీ, రైతు భరోసా వాయిదాలు ప్రభుత్వంపై ప్రజల నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి' అని ఒక ప్రముఖ తెలుగు ఛానల్ పేర్కొన్నది. 'పార్టీ పరంగా రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వపరంగా ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా చూడటంలో మాత్రం విఫలమయ్యారు. పాత ప్రభుత్వం అమలుచేసిన పథకాల ను కొనసాగిస్తూ కొత్త పథకాల అమలు చేస్తే ప్రజ లు హర్షిస్తారు గాని, అమల్లో ఉన్న పథకాలను నిలిపివేసి కొత్తగా ఎన్ని పథకాలు అమలుచేసినా ప్రజ లు సంతృప్తి చెందరు' అని ఒక పత్రిక పేర్కొన్నది. 'ఉన్న నిధులన్నింటినీ రైతు రుణమాఫీకి మళ్లించడం వల్ల మరిన్ని పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా ఎన్నో హామీలు నిలిచిపోయా యి. దీనిపై ప్రజల్లో, ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి నెలకొన్నది' అని మరో పత్రిక విశ్లేషించింది. 'హైడ్రా ఏర్పాటు రేవంత్ పాలనలో ఓ తొందరపాటు చర్య. చెరువులు, కుంటల పరిరక్షణ అవసరమే. కానీ, ఆ సాకుతో పేదల ఇండ్ల కూల్చివేత మొదలైన నాటి నుంచి ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. చేతనైతే అన్ని పార్టీల నేతల, ప్రముఖుల ఫాంహౌజ్‌లను ముందు నేలమట్టం చేయాలి. మూసీ ప్రక్షాళన, హైడ్రా వంటి ఆపరేషన్లను ఒకే పర్యాయం అమలు చేయాలనుకోవడమే ప్రభు త్వం చేసిన తప్పు. లక్ష్యం ఎంత మంచిదైనా దా న్ని చేరుకోవడానికి ఎంచుకొనే మార్గం కూడా పారదర్శకంగా ఉండాలి' అని ఒక పత్రిక సీఎం తప్పొప్పులను అంచనా వేసింది. 'సీఎంగా రేవంత్‌రెడ్డి ముందుగా తన భాషను మార్చుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషనే ఇప్పుడు కూడా వాడితే ప్రజలు హర్షించరు. తనను తాను సవరించుకుంటే బాగుంటుంది' అని ఒక పత్రిక సూచించింది. 'సున్నా మార్కులు వచ్చిన విద్యార్థికి సబ్జెక్టు తెలియనట్టే తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని రేవంత్‌రెడ్డికి రాష్ట్ర అవసరాలు తెలియవు. వచ్చిన అవకాశాన్ని వినియోగించకుండా తెలంగాణ అధికారిక చిహ్నాల మార్పునకు తలపడడం మంచిది కాదు. తెలంగాణ తల్లి మార్పును ఒక ఔట్‌సైడర్ దాడిగా భావించక తప్పదు' అని ఓ ఛానల్లో చర్చ జరిగింది. రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో హామీల అమలులో సందిగ్ధత, హైడ్రా లాంటి తొందరపాట్లు, సాటి నేతల పట్ల దురుసు భాష అనే అంశాలు అన్ని వేదికలపై ప్రస్తావించబడ్డాయి. ఈ విషయాలపై ప్రభుత్వం సమీక్షించుకొని, సవరించుకుంటే ఓట్లేసిన ప్రజలు హర్షిస్తారు.

# 'ఒకే దేశం - ఒకే విధానం'




పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తూ, భారత సమాఖ్య స్ఫూర్తికి సమాధి కట్టే వివాదాస్పద జమిలి ఎన్నికల కోసం బీజేపీ ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రతిపాదించింది. ఈ బిల్లులను ప్రవేశ పెట్టాలా? లేదా అన్న విషయమై ఓటింగ్ జరిగినప్పుడు మొత్తం 461 మంది సభలో ఉన్నారు. అందులో 269 మంది అధికార పక్షానికి అనుకూలంగా, 198 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అప్పుడు సభలో ఉన్న వారి సంఖ్యాబలాన్ని బట్టి చూసినా 'ఒకే దేశం - ఒకే ఎన్నిక'ల బిల్లును ఆమోదింప చేసు కోవడానికి రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు ఎన్డీయే సర్కారుకు లేదని స్పష్టమైంది. ప్రజెం టేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో, ఈ బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిస్తామని కేంద్ర ప్రభుత్వం సభకు హామీ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. జమిలి ఎన్నికల వల్ల వ్యయం భారీగా తగ్గి ప్రభుత్వ ఖజానాకు లబ్ది చేకూరుతుందనేది మోడీ సర్కార్ వాదన. కానీ అసలు కుట్ర వేరే ఉంది. వీరు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 'ఒంటెత్తు పోకడే'! 'ఒకే దేశం - ఒకే విధానం' అంటూ దేశాన్ని క్రమక్రమంగా కేంద్రీకృతం వైపు లాక్కెళ్లుతున్న సంగతి తెలిసిందే. భౌగోళికంగానూ, ప్రజల జీవన విధానంలోనూ అడుగడుగునా భిన్నత్వంతో తొణికిసలాడుతూ ఏకత్వాన్నిచాటే దేశం మనది. సంఘ్ పరి వార్‌కు మొదటి నుంచి కంటగింపు కలిగి స్తున్నదీ ఇదే. అందుకనే దేశంలో ఈ భిన్నత్వ వైశిష్టాన్ని దెబ్బతీసే కుట్రలు సాగుతున్నాయి. సువిశాల భూభాగంలో 140కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో ప్రతి విషయంలోనూ ఒకే విధానాన్ని అనుసరిస్తూ పోతే అది ప్రభుత్వ పాలనాధికారాలు కేంద్రీ కృతం కావడానికి దోహదం చేస్తుందే తప్ప, రాష్ట్రాల పురోగతికి కానీ, ప్రజల సంక్షేమానికి కానీ అది ఏ కోశానా తోడ్పడదు. ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అధ్యక్ష తరహా పాలన దిశగా తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నట్టు స్పష్టం. మూడు నాలుగు రాష్ట్రాలలో కూడా ఒకే విడత ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల కమిషన్‌కు తలకుమించిన భారం అయిపోతోంది. ఒకే రాష్ట్రంలో సైతం మూడునాలుగు విడతలుగా ఎన్నికలు నిర్వహించిన సందర్భాలు అనేకం. అలాంటిది దేశమంతా ఒకేసారి ఎన్నికలు ఎలా సాధ్యం? ఈ రాజ్యాంగ సవరణ బిల్లులు అంతిమంగా గట్టెక్కుతాయో లేదా అన్న విషయం పక్కన పెడితే.. బిల్లు ప్రతిపాదన దశలోనే ప్రతి పక్షాలు చాలా తీవ్రంగా ప్రతి ఘటిం చాయి. ఇండియా కూటమిలోని అన్ని పక్షాలు ముక్త కంఠంతో బిల్లు ప్రతి పాదనను అడ్డుకోవడానికి సర్వ శక్తులూ ఒడ్డాయి. ఒకే దేశం- ఒకే ఎన్నికల ప్రతిపాదనను బేరీజు వేయ డానికి మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికలోనే అనేక లోపాలున్నాయి. ఈ కమిటీ ఏడు దేశాలలో పరిస్థితిని అంచనా వేసినట్టు చెబుతున్నది. కానీ వాటిలో ఒక్క దేశం విస్తీర్ణం మన దేశంలోని ఏ రాష్ట్రం కన్నా పెద్దది కానే కాదు. పదిహేడు వందల పేజీలకు పైగా ఉన్న కోవింద్ కమిటీ నివేది కను ఆరు నెలల్లో తయారు చేశారనడం ఒట్టి 'జుమ్లా'. ఎప్పుడో తయారు చేసి పెట్టుకున్న దస్త్రాలకు ఈ కమిటీతో ఆమోదముద్ర వేయించారని పిస్తోంది. ఒకే భాష, ఒకే కట్టుబొట్టు, ఒకే తిండి, ఒకే విద్య ఇలా దేశమంతా ఒకే విధానం ఉండాలని సంఘ్ పరివార్ పేరాశ. ఈ కోవలో జమిలి ఎన్నికలు కూడా రుద్దాలనే దాని ఉబలాటం. ప్రజల సంపదను లూటీ చేసి కార్పొరేట్ కంపెనీలు కుమ్మరిస్తున్న కోట్లాది రూపాయల సొమ్ముతో 'ఆపరేషన్ కమల్' చేపట్టి, రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చివేస్తూ ఇప్పటికే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేస్తోంది. ఇక దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే అది పార్లమెంటరీ వ్యవస్థకు పెను విఘా తంగా మారుతుంది. సమాఖ్య స్ఫూర్తినే ప్రమాదంలోకి నెట్టే స్తుంది. జమిలి ఎన్నికలు జరపాలంటే దేశంలోని అన్ని శాసన సభలనూ ఒకేసారి రద్దు చేయాలి. లేదా కొన్ని శాసనసభలను ముందస్తు ఎన్నికలకు ఒప్పించాలి. మరికొన్నింటికి పదవీకాలం పొడి గించాలి. ఇంత కసరత్తు చేస్తే తప్ప 'జమిలి' సాధ్యపడదు. భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగం చాలా స్పష్టంగా నిర్దేశిస్తోంది. ఒకవేళ బీజేపీ కోరుకున్నట్టు జమిలి జరిగితే రాష్ట్రాల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుంది. దేశవ్యాప్త ప్రచారాల్లో ప్రాంతాలవారీ సమస్యలు కొట్టుకుపోతాయి. ప్రాంతీయ పార్టీలు ఉనికి కోల్పోయి కనుమరుగయ్యే ప్రమా దముంది. సరిహద్దు ఘర్షణలనో, మైనార్టీలనో బూచిగా చూపెట్టి ప్రజలను మతాల పరంగా, ప్రాంతాల పరంగా చీలి కలు పేలికలు చేసి ప్రజా సమస్యలను తొక్కిపెట్టేస్తారు. మణి పూర్ మారణహోమం, అదానీ వ్యవహారం, రూపాయి అంత కంతకూ దిగజారిపోవడం, వడ్డీరేట్లు, ధరాఘాతం, రైతుల నిర సనలు, నిరుద్యోగం మరింతగా పెరగడం, వాటిని పరిష్కరించే చేవలేకనే బీజేపీ నేడు ఆడుతున్న నాటకాలివి. ఇవి దేశానికే కాదు, ప్రజలకు, ప్రజా ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరం.

# 'స్వర్ణాంధ్ర విజన్-2047' డాక్యుమెంట్ నయా-ఉదారవాద విధానాలు




ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శుక్రవారం ఆవిష్కరించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' డాక్యుమెంట్ నయా-ఉదారవాద విధానాలు మరింత శీఘ్రగతి అమలుకు రోడ్ మ్యాప్. కార్పొరేట్ల అడ్డూఅదుపు లేని దోపిడీకి ఎర్ర తివాచీ. వికసిత భారత్ నిర్మాణం కోసం కేంద్రంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన 'విజన్-2047'లో భాగంగా రాష్ట్రంలోనూ తీసుకొచ్చామని చంద్రబాబు, కూటమి నేతలు ప్రకటించారు. కేంద్రంలో బిజెపి ప్రతిపాదించిన విజన్‌లో అణువణువూ మతతత్వ-కార్పొరేట్ జమిలి విధానాల కలబోత కాగా అందులో భాగమే తమ 'కల' అంటున్నారు చంద్రబాబు. ప్రజలందరికీ సంపద, ఆరోగ్యం, సంతోషం అందించడమే లక్ష్యమని చెబుతున్నారు. పేదరికం లేని సమాజం, ఉపాధి- ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, ఇత్యాది పది సూత్రాలు తమ విజన్‌కు ప్రాతిపదికగా పేర్కొన్నారు. 2047 నాటికి అందరికీ అక్షరాస్యత, 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 42 వేల డాలర్ల తలసరి ఆదాయం, 60 శాతానికి పట్టణ జనాభా, రెండు శాతానికి నిరుద్యోగిత రేటు తగ్గింపు, 85 సంవత్సరాల సగటు ఆయు ప్రమాణం, 450 బిలియన్ డాలర్ల ఎగుమతులు లక్ష్యాలుగా ప్రకటించారు. ఈ 'కలలు' ఆకర్షణీయంగానే కనిపిస్తున్నప్పటికీ వాటి సాధనకు ఎంచుకున్న విధానాలే సదరు కలలను కల్లలు చేస్తాయి. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పి-4 విధానాన్ని తారకమంత్రంగా జపిస్తోంది. ఇప్పటి వరకు మూడు 'పి' లు పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) వాడుకలో ఉంది. కొత్తగా పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపిపి) నాలుగు 'పి' ల ఫార్ములా తెర మీదికి తెచ్చారు. అందులో భాగంగానే విజన్ డాక్యుమెంట్ విడుదల వేదికపై నుంచి ఎక్కడ పరిశ్రమ వస్తే అక్కడి రైతులు భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చినట్లున్నారు. దానర్థం కార్పొరేట్లు పరిశ్రమలు, ప్రాజెక్టులు పెడతారు. అందుకు కావాల్సిన భూములను రైతులు త్యజించాలన్నమాట. రైతుల భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్ర పి-4 సిద్ధాంతం వెనుక దాగుంది. ఇప్పటికే మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోనిటైజేషన్ పైప్‌లైన్ అంది. అడవులను, నదులను, సముద్రాలను, చివరికి జాతీయ రహదారుల, రైల్వే ట్రాక్‌ల వెంబడి భూములను సైతం కార్పొరేట్లకు అప్పగిస్తోంది. చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ అందుకు భిన్నమైంది కాదు. ఆర్థిక హబ్‌లు, హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్, రెండు మెగా పోర్టులు, రీసైక్లింగ్ క్లస్టర్, నౌకా నిర్మాణం, టూరిజం ప్రాజెక్టులు, ఎ.ఐ, డ్రోన్లు.. ఇవన్నీ ప్రైవేట్ కార్పొరేట్ల ప్రాపకం కోసమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాస్తా స్పీడ్ ఆఫ్ బిజినెస్‌గా మారిందీ అందుకే. ఇప్పటికే జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా మార్చింది. పోర్టులు, విద్యుత్, సకలం అదానీకి సమర్పించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందన్న కూటమి తాను కూడా అదే బాటలో పయనిస్తోందనడానికి సెకితో సౌర విద్యుత్ ఒప్పందం కొనసాగింపే ఉదాహరణ. చంద్రబాబు విజన్లు కొత్తవేమీ కావు. 1999 ప్రాంతంలో బ్రిటీష్ మెకెన్సీ కన్సల్టెన్సీ రూపొందించిన 'విజన్ 2020'తో ఊదరగొట్టారు. రాష్ట్ర విభజన అనంతరం 'విజన్ 2029' అన్నారు. ఇప్పుడేమో ఏకంగా రాబోయే 23 ఏళ్లకు 'విజన్-2047' అంటున్నారు. విభజన అనంతరం అవశేష ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని దృష్టిలో పెట్టుకోకుండా విజన్లు అనడం ప్రజలను మభ్యపెట్టడానికే. వ్యవసాయ రాష్ట్రమైన ఎ.పి.లో వ్యవసాయం సంక్షోభంలో ఉంది. రైతుల, కౌలు రైతుల, వ్యవసాయ కార్మికుల బతుకులు ఆందోళనకరంగా తయారయ్యాయి. వారి ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర రైతుల్లో 93 శాతం మంది రుణగ్రస్తులు. సగటు అప్పు రూ.2.45 లక్షలు. ఈ రెండు అంశాల్లో దేశంలో మనమే టాప్. తలసరి ఆదాయంలో 15వ స్థానంలో ఉన్నాం. నిరుద్యోగం, విద్య, వైద్యం, మహిళా, శిశు మరణాలు, వారి సంక్షేమం, ఈ రంగాలన్నీ కునారిల్లుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం రహదార్లు మట్టి రోడ్లు. గుంతలు లేని తారురోడ్లను లక్ష్యంగా ఎంచుకున్న దుస్థితి. విజన్ అనేది నేల విడిచి సాము చేయకూడదు. విస్తృత స్థాయి చర్చలతో రూపొందాలి. ప్రజల మధ్య అసమానతలు రూపుమాపేది అసలైన దార్శనికత.